teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 171 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 17 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఈ నెల 21 వరకు పలు జిల్లాల్లో వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు

### అల్పపీడనం ప్రభావంతో ఇప్పటికే పలుచోట్ల వానలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మరో ఐదురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురు-స్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 21 వరకు పలు జిల్లాల్లో వానలు కురుస్తాయని వెల్లడించింది. నైరుతి

మిగతా 2 లో





## దసరా పండుగ ఆడబిడ్డలను నిరూత్సాహపరిచింది

**మీడియా ప్రతినిధులతో హరీష్ రావు చిట్‌చాట్**

హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): ఈ దసరా పండుగ తెలంగాణ ఆడబిడ్డలను నిరూత్సాహపరిచిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో హరీష్ రావు చిట్‌చాట్

మిగతా 2 లో



## సీఎం రేవంత్ రెడ్డిపై తాటికొండ రాజయ్య ఫైర్

**ఏం మాట్లాడుతున్నాడో ఎవరికి అర్థం కావడంలేదంటూ ఎద్దేవా**

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డిపై స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి లేసినోడిలా

మిగతా 2 లో





# రాబోయే ఎన్నికలల్లో .. మూసీ హైడ్రా ప్రభావం..?

### ఓవైపు ఆందోళనలు.. మరో వైపు హామీలు


### బీఆర్ఎస్ "ప్రజా" ఉద్యమానికి ఈ అంశాలే ఆయుధాలా..?

### ఎత్తులను చిత్తు చేసేందుకు సిద్ధమవుతున్న అధికార పార్టీ

ప్రస్తుత తెలంగాణ రాజకీయాల్లోనే కాదు రాష్ట్ర ప్రజల్లో కూడా తీవ్రమైన చర్చకు దారి తీసింది తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిర్ణయం. అదే మూసి సుందరీకరణ మరియు హైడ్రా ఏర్పాటుతో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు. ఇంత వరకు బానే ఉన్నా.. వచ్చిందల్లా మూసి సుందరీకరణకు అయ్యే ఖర్చు, హైడ్రా బాధితుల ఆందోళన. అయితే ప్రభుత్వం పలుమార్లు నిర్వాసుతులకు తగిన న్యాయం చేస్తామని హామీ కూడా ఇవ్వడం జరిగింది. కాగా ఈ అంశాలపై అటు జనాల్లో.. ఇటు ప్రతిపక్షంలో, ప్రజా సంఘాలల్లో వ్యతిరేకత నెలకొన్నది. ఐతే ఈ అంశాలనే కొన్ని రాజకీయ పార్టీ వర్గాలు వారికి అనుగుణంగా మలుచుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ అంశం రాబోయే ఎన్నికల్లో ప్రభావం చూపనున్నట్లు రాజకీయ నిపుణుల అభిప్రాయం.



2


KTR
@KTRBRS · Follow

రేవంత్ కుర్చీ ఎక్కిన రోజు నుండి తెచ్చిన మొత్తం అప్పులు 80,500 కోట్లు.

10 నెలల్లో 80,500 కోట్ల రికార్డు అప్పులు!!

అప్పు- తప్పు అన్నోళ్లని.. ఇప్పుడు దేనితో కొట్టాలి..? ఎన్నికల హామీలేవీ తీర్చలేదు..!
ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు..!!

మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు··· Show more

8:48 AM · Oct 16, 2024

# ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు..!

### అప్పు చేయడమే తప్పన్నోళ్లను దేనితో కొట్టాలి..?

### ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీర్ ప్రశ్నల వర్షం

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సీఎం కుర్చీ రేవంత్ రెడ్డి ఎక్కిన రోజు నుంచి తెచ్చిన అప్పు 80 వేల 500 కోట్లు అని కేటీఆర్ ట్వీట్ చేశారు. 10 నెలల్లోనే రికార్డు స్థాయిలో రికార్డు అప్పులు తెచ్చారన్నారు. అప్పు తప్పు అన్నోళ్లని ఇప్పుడు దేనితో కొట్టాలని ప్రశ్నించారు. ఎన్నికల హామీలేవీ తీర్చలేదన్నారు. ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదన్నారు. మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు అని నిలదీశారు. 80 వేల కోట్లు ఎవరి జేబులోకి వెళ్లినట్లని అడిగారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా అని ప్రశ్నించారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పు శుద్ధ తప్పు అని ప్రచారంలో ఊదరగొట్టి అవే అప్పుల కోసం ముఖ్యమంత్రి పాకులాడటమేంటి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో అప్పులు తీసుకుని

మిగతా 2 లో



## రాష్ట్రంలోని బిల్డర్స్‌తో డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్ భేటీ

**బిల్డర్లు అభద్రతలో ఉన్నారన్న విమర్శల నేపథ్యంలో ప్రాధాన్యత**

రాష్ట్రంలోని బిల్డర్స్ తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిలు సచివాలయంలో భేటీ అయ్యారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన క్రమంలో సాగుతున్న కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందని, బిల్డర్లు అభద్రతలో ఉన్నారన్న విమర్శల నేపథ్యంలో బిల్డర్లతో భట్టి, ఉత్తమ్ లు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా అభివృద్ధి చేసే కార్యాచరణలో భాగంగా బిల్డర్లతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లుగా భట్టి తెలిపారు. బిల్డర్లతో సమావేశంలో వారి సమస్యలు తెలుసుకుని నగర ప్రగతిలో కీలకంగా ఉన్న నిర్మాణ రంగానికి ప్రభుత్వం వైపు నుంచి అవసరమైన

మిగతా 2 లో

## ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రులు



నల్గొండ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎసెల్బీసీలో గల బత్తాయి మార్కెట్లో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రులు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతు ప్రభుత్వంగా రైతులకు అండగా ఉంటున్నాం అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకున్నా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అన్నారు. 18 వేల కోట్ల

మిగతా 2 లో




## డిసెంబర్ 9 లోగా ప్రతి రైతుకు రుణమాఫీ పూర్తి చేస్తాం

**ఆ తర్వాత రైతు భరోసా రూ.7500 అందజేస్తాం**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

నల్గొండ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ అర్హులైన రైతులందరికీ వర్తింపచేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. డిసెంబర్ 9 లోగా ప్రతి రైతుకు రుణమాఫీ పూర్తి చేసి ఆ తర్వాత రైతు భరోసా రూ.7500 రైతుల అకౌంట్లోకి జమ చేస్తామన్నారు. హాలియా మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

మిగతా 2 లో



## ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లకు లభించని ఊరట

**ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు**

**తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని హైకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): క్యాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. అంతేకాదు క్యాట్ ఆదేశాలను హైకోర్టు సమర్థించింది. 15 రోజుల పాటు ఊరట

మిగతా 2 లో

## జీహెచ్‌ఎంసీ అధికారాలను హైడ్రాకు బదలాయింపు

**అధికారాలను హైడ్రాకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ**



.. వివరాలు 2లో



## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాళా

**కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో చరిత్ర సృష్టించింది**


**పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీసిందని అన్నారు పీసీసీ అధ్యక్షుడు

మిగతా 2 లో

## హైడ్రాకు తెలంగాణ హైకోర్టులో ఊరట

**హైడ్రా ఏర్పాటును తప్పుపట్టలేమని స్పష్టం**



హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్ ): హైడ్రాకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. హైడ్రా ఏర్పాటును తప్పుపట్టలేమని స్పష్టం చేసింది. హైడ్రాను ఏర్పాటు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తేల్చి చెప్పింది. హైడ్రా ఏర్పాటు జీవో నెంబర్.99, హైడ్రా చర్యలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం హైకోర్టు విచారణ

మిగతా 2 లో



## ఫార్మసీ కాలేజీల యాజమాన్యాలు కీలక నిర్ణయం

**ఫీజు రియింబర్స్‌మెంట్స్‌కై నిరసనలకు సన్నద్ధం**

**నేటి నుండి క్లాసుల బంద్ చేస్తున్నట్లు నిర్ణయం**

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఫార్మసీ కాలేజీల యాజమాన్యాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో నిరసనలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే నేటి

మిగతా 2 లో



## జిహెచ్ఎంసి కమిషనర్‌గా రిలీవ్ అయిన ఆమ్రపాలి

**ఇంచార్జ్ కమిషనర్‌గా ఐఏఎస్ ఇళంబర్తికి అదనపు బాధ్యతలు**

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలిని ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఏపీలో రిపోర్టు చేయాల్సిందిగా

మిగతా 2 లో

# రాబోయే ఎన్నికలల్లో "మూసీ" హైడ్రా ప్రభావం..?

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మూసీ ప్రక్షాళన అంశం రోజు రోజుకు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్గా మారుతున్నది. అధికార పార్టీ మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును సీరియస్ గా తీసుకొని రివర్ బెడ్ లో నిర్మించిన ఇండ్లను కూల్చివేస్తోంన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయిస్తామని కూడా హామీ ఇవ్వడం జరిగింది. ఇండ్లు కూల్చడం పట్ల బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మల్చుకునేందుకు గులాబీ పార్టీ యత్నిస్తోందనేది రాజకీయ నిపుణుల వాదన.. దానిని అదే స్థాయిలో తిప్పికొట్టేందుకు అటు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. దీనిపై బుధవారం మధ్యాహ్నం గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ కీలక నేతలు, కార్పొరేటర్లతో సమావేశం జరిగినట్లు సమాచారం. మూసీ ద్వారా తలెత్తే ఇబ్బందులు, నిర్వాసితులకు పునరావాసం అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై చర్చించారు. ఈ సమావేశానికి మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ వ్యక్తిగత కారణాలతో గైర్హాజరయ్యారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ప్రాభవం కోల్పోవడం, వచ్చే ఏడాది డిసెంబర్ లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనుండటంతో ప్రజల్లోకి వెళ్లేందుకు హైడ్రా, మూసీ అంశాలను బలమైన అస్త్రాలుగా వినియోగించుకోవాలని సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం ద్వారా పార్టీ వీడుతున్న ఎమ్మెల్యేలను కాపాడుకోవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. మూసీ సుందరీకరణ వెనుక భారీ స్కాం ఉందనే ఆరోపణను ఎస్టాబ్లిష్ చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైనా చర్చ జరిగినట్టు సమాచారం. కాగా మూసీ, హైడ్రా అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు యత్నిస్తున్న బీఆర్ఎస్ ఎత్తులను చిత్తు చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సైతం అదే స్థాయిలో రెడీ అవుతోంది. బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే మూసీ సుందరీకరణ అంశం తెరమీదకు వచ్చిందని, కేసీఆరే మూసీని థేమ్స్ నది తరహాలో తీర్చిదిద్దుతామని పలుమార్లు చెప్పారని, ఇందుకోసం మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసి సుధీర్ రెడ్డిని చైర్మన్ గా నియమించారు. దీనిపై గత సర్కారు లోన్ కూడా తీసుకుందనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గ్రేటర్ నాయకులకు పీసీసీ చీఫ్ సూచించనున్నారు. అధికారం కోల్పోగానే కొత్త పల్లవి అందుకున్నారని ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ ముఖ్యనేతలు కార్పొరేటర్లు, గ్రేటర్ లీడర్లకు వివరించనున్నారు. మూసీ ప్రక్షాళన వల్ల మురికి కాల్వ పక్కన ఉన్న ఇరుకు ఇంట్లోంచి డబుల్ బెడ్రూం ఇంటికి వెళ్తారని, ట్రాన్స్ పోర్టేషన్ ఖర్చులను కూడా ప్రభుత్వం భరిస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంతా తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. మూసీని అలాగే వదిలేస్తే హైదరాబాద్ నగర ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని, అందరి బాగుకోసం కలిసినడుద్దామనే నినాదాన్ని తెరమీదకు తెచ్చేందుకు కాంగ్రెస్ రెడీ అవుతోంది. ఈ అంశం ప్రజల్లో ఎంతవరకు ప్రభుత్వం చూపుతుందనేది తెలియాల్సి ఉంది.






## దసరా పండుగ ఆడబిడ్డలను నిరూత్సాహపరిచింది


మొదటి పేజీ తరువాయి
నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు అని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఒక చీర కాదు, బతుకమ్మ పండుగకు రెండు చీరలు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రెండు కాదు కదా అసలేం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. దసరా పండుగ వేళ అక్కా, చెల్లెళ్ళను ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఇవే కాదు రైతుబంధు రూ.15 వేలు అన్నారు. కేసీఆర్ కిట్ కంటే మంచి కిట్ ఇస్తామన్నారు. ముదిరాజ్, గంగపుత్రులకు చేప పిల్లలు ఇస్తామన్నారు. ఇచ్చిన హామీలు అన్నీ గాలికి వదిలి బీఆర్ఎస్పై విమర్శలు చేస్తున్నారని హరీష్ రావు ప్రభుత్వంపై సీరియస్ అయ్యారు. ఆగస్టులో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా పోయలేదని మండిపడ్డారు. చేప పిల్లల కోసం తాము రూ.100 కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో రూ.16 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తుచేశారు. చెరువులు నిండుకుండలా ఉన్నప్పటికీ చేప పిల్లల సగమే పోయాలంటున్నారని ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు అని ఎద్దేవా చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై తాటికొండ రాజయ్య ఫైర్

మొదటి పేజీ తరువాయి
మాట్లాడుతున్నాడు. ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఎవరికి అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో సీఎం అజ్ఞానంపై సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు కొనడానికి దొరుకుతున్నాయని అంటాడు. హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రం ఉందని అంటున్నాడు. తెలంగాణలో పాలన పిచ్చోడు చేతిలో రాయిలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలనపై పట్టులేక పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందుల పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.

## ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు..!

మొదటి పేజీ తరువాయి
ప్రాజెక్టులు కట్టామని ప్రతిపైసాతో మౌలిక సదుపాయాలు పెంచామని తీసుకున్న రుణంతో దశాబ్దాల కష్టాలు తీర్చామన్నారు కేటీఆర్. కానీ ముఖ్యమంత్రి తెస్తున్న అప్పుల అడ్రస్ ఎక్కడ అని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా రైతుభరోసా వేయకుండా ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టకుండా నెలల పాటు జీతాలు ఇవ్వకుండా ఇన్ని వేల కోట్లు ఏమైనట్టు అని ప్రశ్నించారు. రాష్ట్ర సంపద సృష్టికి కాకుండా సొంత ఆస్తులు పెంచుకోవడానికే చూస్తున్నారని ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.




## రాష్ట్రంలోని బిల్డర్స్‌తో డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్ భేటీ

మొదటి పేజీ తరువాయి
చేయూతనందిస్తామన్నారు. సమావేశం పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. కాగా బిల్డర్లను, ప్రజలను బెదిరించి వసూళ్ల కోసమే హైడ్రాను ఉపయోగిస్తున్నారని, రియల్ ఎస్టేట్ దివాలా తీసిందని, రిజిస్ట్రేషన్ రెవెన్యూ పడిపోయిందని, మూసీ పేరిట ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించిన క్రమంలో బిల్డర్ల సమావేశంలో ప్రభుత్వం ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

## డిసెంబర్ 9 లోగా ప్రతి రైతుకు రుణమాఫీ పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి
ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పుట్టినరోజు డిసెంబర్ 9 నాటికి రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సన్నాలకు రూ.500 బోనస్ అందజేస్తామని తెలిపారు. నల్లగొండ జిల్లాలో రైతులు పామాయిల్ సాగు గణనీయంగా పెంచాలని, రైతుల సౌకర్యార్థం పామాయిల్ ఉత్పత్తి కేంద్రాన్ని నల్లగొండ జిల్లాలో సైతం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు కనీస సౌకర్యాలు అందించేందుకు మార్కెట్ యార్డులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ,ఇప్పటికే పలు రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించామని తెలిపారు. నల్లగొండ నాగార్జునసాగర్ నియోజకవర్గాలు తమకు రెండు కళ్ళులాంటివని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే లు ఉన్న నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని హామీ ఇచ్చారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పదవులు వస్తాయని ఎటువంటి అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. నిజమైన కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై వివరించారు. అనంతరం హాలియా మార్కెట్ చైర్మన్ గా తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ గా కాల్ సాని చంద్రశేఖర్ యాదవ్, పలువురు డైరెక్టర్లను, మార్కెట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ కర్నాటి లింగారెడ్డి, కొండేటి మల్లయ్య అబ్బిడి కృష్ణారెడ్డి కుందూరు వెంకట్ రెడ్డి కాకునూరు నారాయణ గౌడ్ చింతల చంద్రారెడ్డి భాస్కర్ నాయక్ కృష్ణా నాయక్ పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ అధికారాలను హైడ్రాకు బదలాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ అధికారాలను హైడ్రాకు (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి) బదలాయించింది. ఆర్డినెన్స్ అధికారాలను హైడ్రాకు బదలాయిస్తూ ప్రభుత్వం బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ కట్టడాలు డిజాస్టర్స్ అసెట్స్ ప్రొటెక్షన్‌లో హైడ్రాకు అధికారాలు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో జీహెచ్ఎంసీ పరిధి మొత్తంలో అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించే అవకాశం హైడ్రాకు కల్పించింది ప్రభుత్వం. ఇప్పటికే హైడ్రాకు విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. 'హైడ్రా' చట్టబద్ధతపై హైకోర్టు పలుమార్లు ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో.. ప్రభుత్వం స్పందించి ఆర్డినెన్స్‌ను రూపొందించింది. ఇప్పటివరకు హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఉన్న పలు అధికారాలను ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌తో తన అధీనంలోకి తీసుకుంది. అయితే 'హైడ్రా' ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేయగా.. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నివృత్తి చేశారని, దీనితో గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. జీహెచ్ఎంసీ చట్టం-1955లో ఇప్పటి వరకు 374, 374-ఎ సెక్షన్లు ఉన్నాయి. ఇప్పుడు సెక్షన్ 374-బి చేర్చుతూ ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరించింది. అందులోని అంశాలకు సంబంధించి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సమకూరే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం ఏ ఇతర సంస్థకైనా అప్పగించవచ్చని ఆర్డినెన్స్ చెబుతోంది. ఆ ఆర్డినెన్స్‌కు అనుగుణంగానే..తాజాగా, ఆ అధికారాలను హైడ్రాకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. తద్వారా హైడ్రాకు అదనపు బలం సమకూరినట్లైంది.

## ఈ నెల 21 వరకు పలు జిల్లాల్లో వర్షాలు

మొదటి పేజీ తరువాయి
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతుందని చెప్పింది. ప్రస్తుతం బంగాళాఖాతం చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 320 కిలోమీటర్లు, ఏపీలోని నెల్లూరుకు 400 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని చెప్పింది. పశ్చిమ-వాయువ్య దిశగా పయనిస్తూ ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మధ్యనున్న పుదుచ్చేరి, నెల్లూరు మధ్య గురువారం తెల్లవారు జామున చెన్నైకి దగ్గరలో తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఇక రాష్ట్రంలో బుధవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురిసేందుకు అవకాశం ఉందని ప్రకటించింది. శుక్రవారం ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పలుచోట్ల వర్షాలు కురిసేందుకు అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లకు లభించని ఊరట



మొదటి పేజీ తరువాయి
కల్పించాలన్న ఐఏఎస్ ల విజ్ఞప్తిని కూడా హైకోర్టు తోసిపుచ్చింది. తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాట్ ఆదేశాల ప్రకారం ముందుగా ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాలని, అభ్యంతరాలు, సమస్యలు ఏవైనా ఉంటే తర్వాత వింటామని ఐఏఎస్ అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. అధికారులు ముందు వెళ్లి రిపోర్ట్ చేయాలని, కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి రిపోర్ట్ చేసిన తర్వాతే విచారణ చేస్తామని హైకోర్టు తెలిపింది. రిపోర్ట్ చేయకుండా ఏమీ చేయలేమని, ప్రజా సేవ కోసమే పనిచేయాల్సిన ఐఏఎస్ లు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడికి వెళ్లాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. ట్రిబ్యునల్ కొట్టేస్తే కోర్టులకు రావడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. మీ వాదనలు వింటామని, కానీ ఇలాంటి విషయాల్లో ఇప్పుడు జోక్యం చేసుకోలేమని తెలంగాణ- హైకోర్టు ఐఏఎస్‌లకు స్పష్టం చేసింది.

## జిహెచ్ఎంసి కమిషనర్‌గా రిలీవ్ అయిన ఆమ్రపాలి

మొదటి పేజీ తరువాయి
డీవోపీటీ ఉత్వర్వులు ఇవ్వగా ఆమ్రపాలి ముందుగా క్యాట్‌ని ఆశ్రయించారు. అక్కడ తీర్పు అనుకూలంగా రాకపోవడంతో తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తనని తెలంగాణలోనే కొనసాగించాలని అభ్యర్థించారు. అయితే రెండుచోట్ల ఆమె అభ్యర్థనను తిరస్కరించడంతో ప్రభుత్వం ఆమెను జిహెచ్ఎంసీ కమిషనర్ పదవి నుంచి రిలీవ్ చేసింది. ఆమె స్థానంలో ఇంచార్జ్ కమిషనర్‌గా ఐఏఎస్ ఇళంబర్తికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఇళంబర్తి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణ నుండి ఏపీకి బదిలీ అయిన ఐఏఎస్‌ల స్థానాల్లో ఎనర్జీ సెక్రటరీగా సందీప్ కుమార్ సుల్తానియా, ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రటరీగా శ్రీదేవి, టూరిజం అండ్ కల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్, ఆరోగ్య శ్రీ సీఈవోగా ఆర్వీ కర్ణన్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రులు



మొదటి పేజీ తరువాయి
రూపాయల రుణమాఫీ చేసినం అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు అందుబాటులో ఉన్నారని అన్నారు. 50 వేల ఎకరాల్లో నల్లగొండ జిల్లాలో బత్తాయి పంట పండుతుంది. కావున కోల్డ్ స్టోరేజ్ ని ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోట నల్లగొండ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి అని కొనియాడారు. నల్లగొండకి తనకు చాలా దగ్గర సంబంధం ఉంది అన్నారు. ఎక్కువ కష్టపడి పని చేసే రైతాంగం ఉన్న జిల్లా నల్లగొండ, ఖమ్మం జిల్లా అని అన్నారు. రైతులకు తప్పకుండా టన్నెల్ ద్వారా శ్రీశైలం ప్రాజెక్టుతో నీటిని అందించే దిశగా వెంకటరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నల్లగొండ ప్రజలు ఇచ్చిన బలమే కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అభివృద్ధి వైపు పనిచేసే దిశగా పనిచేస్తున్నారు అన్నారు. అన్ని వ్యవస్థలు గత ప్రభుత్వంలో నిర్వీర్యం అయ్యాయి. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల పై భారం మోపుతున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పాడు చేసిన వారు నేడు శ్రీరంగా నీతులు చెప్తున్నారు అన్నారు. వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుంది అన్నారు. 31 వేల కోట్ల రూపాయలతో పూర్తిగా మేము రుణమాఫీ చేస్తాం అన్నారు. రైతును ఆదుకోవాలి అని అన్నారు. ఈ నెలలో 2 లక్షల రూపాయలు రుణమాఫీ అవుతుంది అన్నారు. అలాగే రెండు లక్షల పైన వారికి కూడా 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తాం అన్నారు. క్యాబినెట్ ఆలోచన చేసి రైతు పంటకు బీమా కూడా మనమే చేయాలి అని పంట బీమా ప్రభుత్వమే ప్రీమియం కడుతుంది అన్నారు. ధాన్యం కొనుగోలులో దొడ్డు, సన్న రకాలు రైతులు సక్రమంగా తీసుకొని రావాలన్నారు. భారతదేశంలో అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. అలాగే కోటి యాభై లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిచినం. సన్న రకం ధాన్యం కి 500 బోనస్ ఇస్తున్నాం అన్నారు. రైతాంగంకి ఎలాంటి నష్టం లేకుండా ఈ ప్రభుత్వం పనిచేస్తుంది అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నల్లగొండలో ఏర్పాటు చేసుకుందాం అన్నారు. పామాయిల్ తోటలు వేయండి భారీ లాభాలు ఉన్నాయ్. పామాయిల్ తోటకు ఎకరానికి 50 వేలు ప్రభుత్వం ఇస్తుంది అన్నారు. ఈ ఐదు ఏండ్లలో 10 లక్షల పామాయిల్ తోటలు వేయండి అన్నారు. రైతు భరోసా 7500 రూపాయలు కూడా రైతులకు ఇస్తాం అన్నారు.

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాళా

మొదటి పేజీ తరువాయి
మహేష్‌కుమార్ గౌడ్. బుధవారం హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ క్రమశిక్షణ ఉల్లంగిస్తే చర్యలు తప్పవు. ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదు. పార్టీ లైన్‌లో పని చేయాల్సిందేనని ఆదేశించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ. 7 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీసింది. కానీ కాంగ్రెస్ అలా కాదు. అధికారంలోకి వచ్చాక 10 నెలల కాలంలో అనేక అద్భుతమైన పనులు చేసింది. అటు రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టింది. ఇచ్చిన హామీలను నెరవేర్చింది. గ్రేటర్ ఎన్నికల్లో ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తారంగా తీసుకెళ్లాలి. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించాలి. మనం గట్టిగా పనిచేస్తేనే ప్రజల్లోకి వెళ్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చరిత్ర సృష్టించింది. ప్రభుత్వం చేస్తున్న పనులను నాయకులు లోతుగా అధ్యయనం చేయాలి. అర్థం చేసుకోవాలి. ప్రజల్లో మంచి స్పందన ఉంది. ప్రతి పక్ష బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసి పోయాయి. రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ కుట్రల్ని మనం తిప్పికొట్టారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున గ్రేటర్ లో విజయం సాధిస్తేనే మనకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుంది. కాబట్టి హైదరాబాద్ జిల్లా నాయకులు పకడ్బందీగా పని చేసి ఫలితాలు సాధించాలి అని బి.మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## హైడ్రాకు తెలంగాణ హైకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి
జరిపింది. ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా చట్టవిరుద్ధమెలా అవుతుందని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా చట్టవిరుద్ధంగా చర్యలు చేపడితే వాటిని ప్రశ్నించే అధికారం ఉంటుంది తప్ప ఏర్పాటునే ఎలా ప్రశ్నిస్తారంది. ఒకవేళ చట్టవిరుద్ధంగా ప్రైవేటు ఆస్తుల్లోకి చొరబడినా, ఆస్తులను కూల్చివేసినా నష్టపరిహారం కోరుతూ కింది కోర్టుల్లో పిటిషన్‌లు దాఖలు చేసుకోవచ్చని పేర్కొంది. అంతేకాకుండా కూల్చివేతలకు సంబంధించి చట్టప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఇదే హైకోర్టు ఆదేశాలిచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

## ఫార్మసీ కాలేజీల యాజమాన్యాలు కీలక నిర్ణయం



మొదటి పేజీ తరువాయి
నుంచి కాలేజీల్లో క్లాసుల బంద్ చేస్తున్నట్లు యాజమాన్యాల నిర్ణయం తీసుకున్నాయి. అంతేకాదు.. వారం తర్వాత నిరవధిక బంద్‌కు వెళ్తామని ప్రకటించాయి. ఇప్పటికే డిగ్రీ, పీజీ కాలేజీల్లో క్లాసులు బంద్ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.6,000 కోట్లకు పైగా పేరుకుపోయినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి నిధులు విడుదల చేయకపోవడంతో భారీగా బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. గత ఏడాది డిసెంబరు 7న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయలేదు. దీంతో ఆ ఫీజులను చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులపై ఆయా కాలేజీలు ఒత్తిడి తెస్తున్నాయి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# హక్కుల యోధుడు సాయిబాబా

ప్రభుత్వ కాంక్ష తీరనే లేదు. 'నేను చావుని ధిక్కరిస్తున్నాను' అని ప్రతిజ్ఞ చేసిన జి ఎన్ సాయిబాబా జైలు బయటే మరణించారు. తొమ్మిదేళ్ల పాటు నాగపూర్ జైల్లోని అండా సెల్ తనను వేపుకుతిన్నా తన పంతాన్ని నెగ్గించుకున్నారు. శారీరకంగా తొంభై శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా ఇప్పుడు మన దేశంలో సాగుతున్న ఫాసిస్టు పాలనకు సాక్ష్యంగా ప్రపంచం ముందు నిలబడ్డారు. హింసకు నాజీ ఇజం పర్యాయపదం. 'నాజీల మించినవురో..' అనే పాట ఒకటి ఉంది. అది ఇప్పుడు మన దేశాధినేతకు సరిగ్గా సరిపోతుంది. సామ్రాజ్యవాదానికి బంట్లుగా పనిచేస్తున్న పాలకులు దేశఖనిజ సంపదను దోచిపెట్టేందుకు ఎంతకైనా సిద్ధపడతారు. గిరిజనులకు అడవిలోంచి గెంటేసి ఆ నేలలో ఉన్న ఖనిజాన్ని విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేస్తారు. గిరిజన హక్కులకు ఈ చర్యలు భిన్నమని అడ్డొచ్చిన వారిని దేశద్రోహులుగా చిత్రించి అక్రమ కేసులతో వారిని జైళ్లలో బందీలుగా చేస్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే సాహసాన్ని నలిపేసేందుకు జైలు చట్టాలను కాలరాస్తారు. ఒక ప్రశ్నను ఊపిరాడకుండా చేస్తే మరో ప్రశ్న గొంతు పెగలకూడదు. కొత్త ప్రశ్నలు వణికిపోయేలా హింస ఉండాలి. అందుకోసం దేశంలోని కోర్టులు, న్యాయమూర్తులు, జైళ్లు, జైలర్లు ఒక్కటై రాజ్యానికి ఊడిగం చేసేందుకు సిద్ధమే. ప్రజలకు ఉన్న హక్కులను అడిగేవాడిపై అర్బన్ నక్సలైట్ ముద్రవేయాలి.

వాడి కుటుంబాన్ని ప్రశాంతత లేకుండా చేయాలి. కేసుల్లో ఇరికించి జైళ్లలో మగ్గించి, శరీరాన్ని పిప్పిచేసి చంపేయాలి. ఒకరిపై చేసే ఈ హింస, క్రూరత్వం చూపించి హక్కుల పేరెత్తేవాడికి భయం పుట్టించాలి. అన్నీ బాగున్నవాడి కన్నా అంగవైకల్యం ఉన్నవాడిపై తమ ప్రతాపం చూయిస్తే ఫలితం మరీ బాగుంటుందని రాజ్యం పేరాశ. అందుకు దొరికిన ప్రయోగజీవియే సాయిబాబా. అందుకే ఉపా చట్టం కింద సాయిబాబాతో పాటు అరెస్టయినవాళ్లకు బెయిల్ వచ్చినా, అతన్ని మాత్రం వచ్చిన బెయిళ్లను కొట్టేస్తూ తొమ్మిదేళ్ల పాటు నాగపూర్ అండా సెల్ లో కుక్కేశారు.

బాల్యంలోనే కాళ్లు చచ్చుబడిపోయిన సాయిబాబా శరీరాన్ని ఈడ్చుకుంటూ యూనివర్శిటీ మెట్లెక్కి ఉన్నత చదువులు అందుకున్నారు. ఇంగ్లీష్‌లో పిహెచ్‌డి చేసి ఢిల్లీలోని కాలేజీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. స్వతహాగా పౌరహక్కులపై గౌరవంతో ఉద్యమాల్లో పాల్గొనే ఆయన ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్‌లో చేరి 1995లో జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. 9 మే 2014 నాడు కాలేజీ నుండి ఇంటికి వస్తుండగా పోలీసులు ఆయనను పట్టుకొని గడ్చిరోలికి తీసికెళ్లారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయని ఉపా చట్టం కింద కేసు పెట్టి నాగపూర్ సెంట్రల్ జైలుకు పంపారు. తమకు సాయిబాబా సహకరిస్తున్నారని 2013లో పట్టుబడిన మావోయిస్టు కార్యకర్తలు తమ వాంగ్మూలంలో చెప్పారనే ఒకే మాటపై సాయిబాబా పోలీసుల బారినపడ్డారు.

తప్పించుకు పోతాడనే అనుమానంతో సర్వదా పోలీసుల నిఘా ఉండే ఎలుకల బోనులాంటి సెల్‌లో కుర్చీకి అతుక్కుపోయే ఆయన్ని వేశారు. ఒకరి చేయిస్తే తప్ప కదలలేని మనిషిని అలా ఉంచడం హేయమైనది. జైలు సూపరింటెండెంట్ తీసుకొనే ఈ నిర్ణయాలపై కోర్టు జోక్యం చేసుకోదు. అంగవైకల్యం ఉన్నందున సాయిబాబాకు నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలని ఎన్ని విన్నపాలు చేసిన ఫలితం రాలేదు. ఒక కోర్టు బెయిల్ ఇవ్వగానే మరో కోర్టు దాన్ని రద్దు చేసేది. ఇదంతా ప్రభుత్వం పన్నిన భారీ కుట్రలో భాగమే అనిపిస్తుంది. 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఆయనకు జీవితఖైదు శిక్ష వేసింది. 2022లో బాంబే హైకోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. పునర్విచారణ కోరుతూ ఆ తీర్పును మర్నాడే సుప్రీం కోర్టు నిలిపివేసింది. మళ్ళీ విచారణ జరిపిన బాంబే హైకోర్టు 5 మార్చి 2024 నాడు సాయిబాబాను మళ్ళీ నిర్దోషిగా ప్రకటించింది. కేసులో సమర్పించిన సాక్ష్యాలు నమ్మశక్యంగా లేవని కోర్టు పేర్కొనడం గమనార్హం. పట్టుకెళ్లిన నాటి నుండి విడుదలయ్యే దాకా తనకు మావోయిస్టులతో ఎలాంటి సంబంధాలు లేవని సాయిబాబా చెపుతూనే ఉన్నారు. ఆయన మాట నిజమని తేల్చడానికి చట్టానికి పదేళ్లు పట్టింది. చేయని నేరానికి ఎన్ని తిప్పలు పడ్డా బెయిల్ దొరకలేదు. చివరకు తల్లి చనిపోయినా చివరిచూపు దక్కలేదు. ఆయన్ని ఇంతేసి ఇబ్బందులపాలు చేసే హక్కు చట్టానికి ఎవరిచ్చారు? ఆయన భార్య, కూతురు పడిన మానసిక క్షోభకు బాధ్యులెవరు? ఉన్నత ఉద్యోగం పోయి, చికిత్సలకు కూడా డబ్బు సరిపోని పరిస్థితికి కారణమెవరు? రాజకీయ పెద్దలైన శరద్ పవర్, సిహెచ్ విద్యాసాగర్ రావు లాంటి వారి మాటలు కూడా పనిచేయలేదు. జరిగిన నష్టానికి మన చట్టాల్లో జవాబు లేదు. జైలులో తాను ఎలా ఉండేదీ, తన ఆరోగ్యం ఎలా దెబ్బ తిన్నదీ అనే విషయాలపై సాయిబాబా పత్రికల్లో వివరించారు. అండా సెల్‌లో 14 నెలలు గడిపిన తర్వాత అక్టోబర్ 2015లో రాసిన వ్యాసంలో ఆ సమయం 14 ఏళ్లుగా అనిపించింది అన్నారు. తాను మరో వంద నెలలు అక్కడే ఉండవలసి వస్తుందని అప్పటికి ఊహించి ఉండరు. ఎనిమిది నెలల తర్వాత వెస్టర్న్ కమోడ్ ఏర్పాటు చేశారు. అదీ కూడా సరిగ్గా పని చేసేది కాదు. రోజుకు ఒక బకెట్ నీళ్లు మాత్రమే లభించేవి. తనకు వెన్నుపాములో సమస్య ఉందని తెల్సినా పోలీసులు తన చేతులు పట్టుకొని లాక్కుపోయేవారని, దాని వల్ల నరాలు దెబ్బతిని ఎడమవైపు శరీరం పనిచేయడం మానేసిందని రాశారు. సరియైన వైద్యం చేయించకుండా పెయిన్ కిల్లర్స్ ఇచ్చేవారు. దాని వల్ల శరీరం మరిన్ని రోగాలకు నిలయమైంది. జైల్లోకి వెళ్లేముందు కాళ్లు పనిచేయకపోవడం తప్ప తనకు ఏ అనారోగ్యం లేదు. 21 రకాల వ్యాధులతో బయటికి వచ్చాను. ఎప్పటికప్పుడు వైద్యం అందిస్తే తన ఆరోగ్యం దెబ్బ తినేది కాదు అన్నారు. విడుదల తర్వాత ఢిల్లీలో మార్చి 9 న విలేకరులతో మాట్లాడుతూ ఆయన 'మీ ముందు సజీవంగా కనబడుతున్నాను కానీ శరీరంలోని అవయవాలన్నీ విఫలమైనాయి' అన్నారు. అదో భయంకర సత్యం. ఆ మాటన్న ఆరు నెలలకే, 57 ఏళ్ల వయసులో సాయిబాబా జీవితం ముగియడం విషాదకరం. తన కుటుంబంతో, సన్నిహితులతో ఆయన ఇంకా ఎంతో కాలం బతకాల్సింది. కోల్పోయిన జీవితానికి ఫలితం దక్కకుండానే నిష్క్రమించడం బాధాకరం. వైకల్యం అనుభవిస్తూ ఆయన మానవ హక్కుల కోసం దృఢంగా నిలబడడం, ఎంతటి కష్టాలకైనా సిద్ధపడడం అనన్యమైనది.

# సమ్మక్క సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి

### గుర్తించేదాక కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు వదలదు కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్న మంత్రి సురేఖ



తాడ్వాయి, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలలో కొలువైన వనదేవతలు సమ్మక్క సారక్కలను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ బుధవారం దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ-కొండా మురళీధర్ రావు దంపతులతో పాటు వారి కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్, మనవడు శ్రీయాన్ష్ మురళీకృష్ణతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని, నిలువెత్తు బంగారం సమర్పించారు. తమ మనవడి తలనీలాలు సమర్పించిన అనంతరం సమ్మక్క సారక్కల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క పూజారులు మంత్రిగారికి అమ్మవార్ల చీరె, పసుపు కుంకుమలను అందించారు.



ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సమ్మక్క సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించే దాకా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు వదలదని మంత్రి సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన జాతరను దిగ్విజయవంతంగా చేపట్టిందని గుర్తు చేశారు. దేవాదాయ శాఖ తరపున మంత్రిగా తాను, గిరిజన బిడ్డ, మంత్రి సీతక్క సమ్మక్క సారక్క జాతర ప్రాంత అభివృద్ధి కోసం, సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. తమ కులదైవమైన సమ్మక్క సారక్కలను ప్రతియేడు దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతున్నదమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనించాలనీ, రాష్ట్ర ఆర్థిక కష్టాలు గట్టెక్కాలనీ మంత్రి సురేఖ ప్రార్థించారు. రాష్ట్ర ప్రదాత అయిత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆశయాల సాధనకు వనదేవతలు శక్తిసామర్థ్యాలను ప్రసాదించాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

# పోటీ పరీక్షల అభ్యర్థుల కొరకు ఆర్దిక ముఖ చిత్రం పుస్తక ఆవిష్కరణ

ములుగు జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్. తన ఛాంబర్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కొరకు ప్రణాళికా శాఖ రూపొందించిన తెలంగాణ సామజిక ఆర్థిక ముఖ చిత్రం-2024 పుస్తకాన్ని ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించినహో సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు ఫార్మా స్యూటికల్స్‌తో సహా విభిన్న రంగాల ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితిని,హౌరాష్ట్రం యొక్క వ్యూహాత్మక స్థానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి మరియు సహాయక విధానాలు గణనీయమైన పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధి,హౌకీలక ఆర్థిక సూచికలను క్రోడీకరించి ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో మన రాష్ట్రం ఎలా పురోగమిస్తోందో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పధం 2024 తెలియచేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. తెలిపారు. ఆర్థిక వృద్ధి మరియు ఉపాధి అవకాశాలను తెలియ చేస్తూ ప్రణాళికా శాఖ ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు.హౌ ప్రభుత్వ ఉద్యోగాలు సాధనలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, ఉపాధ్యాయులు మరియు పరిశోధకులకు ఈ పుస్తకం చాలా ఉ



పయోగపడుతుందని కలెక్టర్ గారు తెలిపినారు. ఒక్కొక్క పుస్తకాన్ని రూ. 150/-లకు ముఖ్య ప్రణాళికా అధికారి కార్యాలయం, ములుగు నందు కార్యాలయ పని వేళలలోహౌ విక్రయించడం జరుగుతున్నది. కావున ఆసక్తిగల వారు కొనుగోలు చేయవలసినదిగా తెలిపారు. సమగ్ర సమాచారంతో పుస్తక రూపకల్పనలో భాగస్వాములైన అన్ని విభాగాల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి యం.ప్రకాష్, డి.పి ఆర్ ఓ, రఫిక్, డిప్యూటి ఎస్.ఓ. యూ.లక్ష్మి నారాయణ, డి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు



ములుగు, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు, సంక్షేమశాఖ మంత్రివర్యులు దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలమేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన నీరటి సమ్మయ్యను మరియు ఇటీవల మరణించిన రాజు కుటుంబాలను పరామర్శించి రాజు కుటుంబ సభ్యులకు మరియు వారి పిల్లలకు 5000 రూపాయల ఆర్థిక చేసి వారికి మనోధైర్యం చెప్పి వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కాంగ్రెస్ జిల్లా



ఉపాధ్యక్షుడు కూనూరు అశోక్ గౌడు గ్రామ కమిటీ అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచులు నలుబోలు శ్రీధర్, బొచ్చు బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ గుండ మొగిలి మరియు బొడీయ బిక్షపతి, జనగాం శ్రీను, లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతా, పరిశ్రుభ్రతపై అవగాహన సదస్సు

### నాబార్డ్ ఆర్థిక సౌజనంతో కార్యక్రమం

ములుగు, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): బుధవారం రోజు నాబార్డ్ ఆర్థిక అక్షరాస్యతా, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన భూపాలనగర్ గ్రామం మల్లంపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో కళాజాత బృందం ద్వారా బుర్రకథా జానపద గేయాలు మరియు ఆటపాటలతో అవగాహన పరచడం జరిగింది. ఈ సదస్సుకు నాబార్డ్ ఏజీఎం రవి చైతన్య హాజరై మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు బ్యాంకు అందించే సేవలు ఉపయోగించుకోవాలి వ్యవసాయ పంట రుణాలు సంవత్సరం లోపు రెన్యూవల్ చేసుకోవటం ద్వారా వడ్డీ రాయితీ వస్తుంది కావున రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి, అలాగే కేంద్ర ప్రభుత్వం





అందించే ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన మరియు అటల్ పెన్షన్ యోజనలో అర్హత ఉన్న ప్రతి ఖాతా దారులు చేరాలని, ఖాతాదారుడు సహజ లేదా ప్రమాదం జరిగి మరణించిన 2-లక్షల నుండి 4-లక్షలు భీమా ఉంటుంది కావున ఖాతాదారులు ఈ అవకాశాలు వినియోగించు కోవాలన్నారు. అలాగే సైబర్ నేరల పై అప్రమత్తంగా ఉండాలి ఎవ్వరికి ఖాతా,ఎటిఎం, ఓటీపీ, సీవీవీ, నెంబర్లు చెప్పవద్దు. గ్రామమంలో పరిసరాల పరిశుభ్రత పాటించండి రోగాల దూరం చేయండి అని స్వచ్ఛత హే సేవ గురించి వివరించారు. ఈ సదస్సులో నాబార్డ్ ఏజీఎం రవిచతన్య గారు, ఏపీజీవీబీ ఎఫ్ఎల్సీ కౌన్సిలర్ ఎం. ప్రేమ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్స్ ఏ. రాజగోపాల్,జి. సమంత్, కుమార్, బ్యాంకు మిత్ర వెంకన్న, ఎంవీ కళాజాత విజయ్ బృందం మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మండల విద్యాధికారికి సన్మానం



దేవరకద్ర, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా,మదనాపురం మండల విద్యాధికారిగా షేక్ ఫారూక్ హుసేన్ నియమితులై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం నాడు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి,టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజాద్ అలీ ఎంఈఓ కార్యాలయంలో పూలమాలతో సత్కరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రావుఫ్, మండల కాంగ్రెస్ నాయకుడు గుంద్రతీ సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీపీ వర్ధంతి



### - నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

వనపర్తి నియోజకవర్గం, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్ ): వనపర్తి జిల్లా పరిధిలోని శ్రీరంగాపురం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వర్గీయ లక్ష్మీనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన వనపర్తి పిసిసి డెలిగేట్ మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తైలం శంకర్ ప్రసాద్ , మార్కెట్ కమిటీ చైర్మన్, వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు బండారు శ్రీనివాస్ గౌడ్ మాజీ డిసిసి కార్యదర్శి తిరుపతయ్య , కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామిరెడ్డి, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను బీసీలకు చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జిల్లాలో ఒక మంచి బీసీ నాయకుడు కోల్పోవడం జరిగిందని ఈ లక్ష్మీనారాయణ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# యువజన సంఘాలనుంచి దరఖాస్తుల ఆహ్వానం

ములుగు జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): నెహ్రూ యువ కేంద్ర వరంగల్ (ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర మరియు యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లా లో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘం లోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను తీసుకుని వచ్చి హన్మకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల అనగా అక్టోబర్ 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు.మరిన్ని వివరాల కొరకు 0870- 2958776 సంప్రదించండి.

# ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ




### 2000 సం. పూర్వ విద్యార్థుల సహకారంతో

నేరేడుచర్ల, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండల పరిధిలోని పెంచికల్ దిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సుమారు 20వేల రూపాయల ఖరీదు చేసే ప్రింటర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాస్ కు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు మరియు దాతల సహకారంతో పాఠశాలకు అన్ని హంగులు సమకూరుతున్నాయని, అన్ని సౌకర్యాలు సమకూర్చుకుంటున్నామని ఆయన అన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

## జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్




ములుగు జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ హౌసమావేశ మందిరంలో జరిగిన ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసుల పెండింగ్, పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించి కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మణ్ నాయక్, గత సమావేశంలో చర్చించి తీసుకొన్న చర్యల గురించి వివరిస్తూ 36 కేసు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. వెంకటాపూర్, మంగపేట మండలాల్లోని లాండ్ కేసు లను ఎంక్వైరీ చేయాలని తహసిల్దార్ లు అదేశించినారు. ఎస్, ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులను నియమించినారు.

1. జన్ను రవి
2. చింతకృష్ణ
3. బానోత్ రాము నాయక్
4. మురుకుట్ల నరేందర్
5. సునర్కని రాంబాబు

ఇట్టి సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని DSCDO ను కలెక్టర్ ఆదేశించినారు. క్షేత్ర స్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని అన్నారు. ఎస్సి ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్ లో అందిస్తున్న మెనూ ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. డి ఎస్ పి డి సి ఆర్ బీ రాములు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరపున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, డి ఏ ఓ సురేష్ కుమార్, ఎస్సి కార్పొరేషన్ ఈ డి తుల రవి, బి సి వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యులు జన్ను రవి, సునర్కాని రాంబాబు, ముర్కుట్ల నరేంద్ర,చింతా కృష్ణ, బానోత్ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడాజ్యోతిని ప్రారంభించిన కలెక్టర్

■ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికే సీఎం కప్



వరంగల్ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): గ్రామీణ స్థాయి నుండి యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ బుధవారం ఉదయం వరంగల్ కు చేరుకుంది. క్రీడాజ్యోతి ర్యాలీకు వరంగల్ లోని పోచమ్మ మైదానం వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, డిసిపి రవీందర్ ఘన స్వాగతం పలికిన అనంతరం ర్యాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు త్వరలో నిర్వహిస్తున్న సీఎం కప్ గురించి చైతన్యం కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. మన జిల్లా నుండి ప్రపంచ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులు తయారు కావాలని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మన జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుండి యువత పెద్ద ఎత్తున సీఎం కప్ క్రీడలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీ పోచమ్మ మైదానం నుండి ఎం జి ఎం మీదుగా హనుమకొండ వేయి స్తంభాల దేవాలయం వరకు అట్టహాసంగా సుమారు 800 మంది క్రీడాభిమానులతో క్రీడాజ్యోతి ర్యాలీ సాగింది. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సీఎం కప్ క్రీడా జ్యోతిని వేయి స్తంభాల దేవాలయం వద్ద హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపిలు రవీందర్, షేక్ సలిమా, జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్యాట్రన్ వరద రాజేశ్వర్ రావు, జనరల్ సెక్రెటరీ కైలాష్ యాదవ్, పెట్టా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి రఘువీర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ క్రీడా సంఘ బాధ్యులు, పాఠశాలల పిటి, పిఈటీలు సిబ్బంది, క్రీడాకారులు, యువతి, యువకులు, విద్యార్థి, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ

- ♦ విద్యతోపాటు క్రీడల్లో నైపుణ్యత సాధించాలి
- ♦ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- ♦ పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్






మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేయాలని, పల్లెల నుండి ప్రపంచ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ జిల్లా కేంద్రం చేరుకుంది. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో , రెవెన్యూ, డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, స్వాగతం పలికి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించబోతున్న సీఎం కప్ 2024 పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం కల్పించే ఉద్దేశంతో ఈ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా, కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, ములుగు భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించారని, జిల్లాలో మహబూబాబాద్, నెల్లికుదురు, తొర్రూరు, నుండి జనగామకు వెళ్తుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ యువత క్రీడల్లో వారి యొక్క సత్తాను చాటాలని అందుకు ముఖ్యమంత్రి కప్ మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కప్ నోడల్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ కన్నం మధు, జిల్లా స్పోర్ట్స్ అధికారి అనిల్, గోకుల్, రతన్ కుమార్ బోస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్, జిల్లా అధికారులు కలెక్టరేట్లోని అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లను సిద్ధం చేయాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద దొడ్డు,సన్న రకం ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధర తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు, సన్న రకం ధాన్యాల కొనుగోలుకు వేరువేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500లను బోనస్ ప్రకటించిందని, వాటి కొనుగోలులో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

సన్న రకం ధాన్యాన్ని గుర్తించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డిజిటల్ మైక్రో కాలిపర్స్, ప్యాడి క్లీనర్స్, డ్రయ్యర్స్ ను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యం బస్తాలకు ఎరుపు రంగు దారంతో కుట్లు వేయాలన్నారు. దొడ్డు రకం ధాన్యం సంచులకు ఆకుపచ్చ రంగు దారంతో కుట్లు వేయాలన్నారు. సన్నరకం ధాన్యం నింపే కొత్త సంచులను తిరగేసి ధాన్యం నింపిన అనంతరం వాటికి సంబంధించిన వివరాలను సంచులపై ఎస్ గుర్తుతో పాటు సెంటర్ నెంబర్ స్టెన్సిల్తో మార్క్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి వ్యవసాయ అధికారులు అందించిన టోకెన్ ఆధారంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలును చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, ఇతర అధికారులతో పాటు ప్యాక్స్ కార్యదర్శులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా పని చేద్దాం

## - షాపూర్ గ్రామం ఆదర్శమవ్వాలి
## - సాయన్న విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి నియోజకవర్గం, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పథకాల అమలులో ఖిల్లా ఘనపురం మండలం షాపూర్ గ్రామం అందరికీ ఆదర్శవంతంగా ఉండేలా ప్రభుత్వ పథకాల అమలు చేపడదామని వనపర్తి ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. షాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పండుగొల్ల సాయన్న విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పండుగొల్ల సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షాపూర్ గ్రామ ముదిరాజ్ సంఘంతో పాటు గ్రామం ప్రజలు ఎంతో ఐక్యతగా ఏర్పడి గ్రామంలో పండుగొల్ల సాయన్న లాంటి సాహస వీరుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. షాపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని మొట్టమొదటగా గ్రామంలో ఇల్లు లేని నిరుపేదల ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా ప్రజలంతా ఐక్యంగా ఉండి వారిని గుర్తించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామస్తులు నాయకులు ఎమ్మెల్యే గారికి శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులలో ప్రోగ్రాం అధికారుల ఆకస్మిక తనిఖీలు





మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): బుదవారం మహబూబాబాద్ పట్టణంలోని ఆసుపత్రులలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ లు నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన వారి వివరాలు, స్కానింగ్ నిర్వహించిన వారి వివరాలు, పూర్తి ఇంటి పేరు, ఇంటి నెం, చిరునామా, మొబైల్ నెంబర్, ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫామ్ %-%ఎఫ్ రికార్డులు సక్రమంగా ఉండాలని ప్రతి నెల 5వ తేదీ లోపల జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంనకు ఖచ్చితంగా పంపించాలని ఆయన పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ చేయకూడదని, ఎంటిపి నియ మాలకు, వ్యతిరేకంగా అబార్షన్ లు చేయకూడదని అలాగే సాధారణ ప్రసవాల రేటు పెంచాలని ఆయన అన్నారు. ఆసుపత్రులలో పిల్లల మరణాలు, మాతృ మరణాలు సంభవించినట్లైతే వివరాలను కార్యాలయంలో అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి సాదారణ ప్రసవం గూర్చి ముందు నుండే సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కే వి రాజు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలా.. కాంగ్రెస్ కమిటీలా..?

## కమిటీలను అఖిలపక్ష కమిటీలుగా మార్చాలి
## కందగట్ల అనంత ప్రకాష్ డిమాండ్



పాలకవీడు, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడానికి లబ్ధిదారులు నిర్ణయించడానికి ఇందిరమ్మ కమిటీల పేరిట అంతర్లీనంగా వీటిని కాంగ్రెస్ కమిటీలుగా మార్చి వేసే కుట్ర లో భాగమేనని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక న్యాయంగా పేదవారికి లబ్ధి జరగాలంటే ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు అమలుతోపాటు అన్ని రాజకీయ పక్షాలను చేర్చి అఖిలపక్ష కమిటీలుగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం వారి కంటే ముందు కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లను ఎద్దేవాచేసి కెసిఆర్ పేదలకు ఇవ్వకపోగా తన తొమ్మిదేళ్ల పాలనలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి లబ్ధిదారులను నిర్ణయించకపోవడం దారుణ విషయమని ఆయన అన్నారు. అదే సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం సొంత ఇండ్ల స్థలాలు ఉన్నవారిని ఇందిర ఇండ్ల పేరా ఇల్లు కట్టుకోనడానికి 5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించిందని అమలు చేసేందుకు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలుగా నామకరణ చేసి సర్పంచ్ కార్యదర్శి ఇద్దరు పొదుపు సంఘాల మహిళలు ఓసి ఎస్టీ బీసీ ల నుండి ఒక్కొక్కరిని కమిటీలో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇవన్నీ ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల కనుసన్నల్లో ఇచ్చేందుకు ఈ కమిటీలు వేసిందని ఆయన అన్నారు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి రేవంత్ కు మచ్చ రాకుండా ఉండాలంటే రాష్ట్ర క్యాబినెట్ మరియు ముఖ్యమంత్రి పునర్ ఆలోచించి ఇందిరమ్మ కమిటీలను ప్రస్తుతం మార్గదర్శకాలతో పాటు అన్ని రాజకీయ పక్షాల నుండి ఒక్కొక్కరి చేర్చి అఖిలపక్ష కమిటీలుగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు

# 4వ బెటాలియన్లో క్రీడా పోటీలను ప్రారంభించిన కమాండెంట్




మామునూరు,అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామూనూరు లో గల నాలుగవ బెటాలియన్ లో ఇంటర్ కాయ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ బి. రామ్ ప్రకాష్ శాంతికపోతాలను ఎగురవేసి క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మన జీవన శైలిలో ముఖ్యమైన భాగం. ఇవి శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానసిక శక్తి, ధైర్యం మరియు క్రమశిక్షణను పెంచే ప్రధాన సాధనంగా ఉపయోగపడతాయని అలాగే గెలుపు లేదా ఓటమి కేవలం ఫలితాలు మాత్రమే. నిజమైన గెలుపు మన శ్రమలో, పట్టుదలలో, పోరాట స్ఫూర్తిలో ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, వీరన్న , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శోభన్, రవి, కిరణ్, సర్వర్, రాజిరెడ్డి, చంద్రన్న, రమేష్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటిఐలో ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటిఐ, భూపాలపల్లి నందు కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ నందు ప్రాంతీయ ఉప సంచాల కులు, భూపాలపల్లి, కాజీపేట ఐఐటి ప్రిన్సిపాల్స్ తో ఆడ్వాన్స్డ్ టెక్నాలజీన సెంటర్ లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాలు కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు భూపాలపల్లి, సుభాష్ నగర్ కాలనీలోని ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ https:/iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా కానీ అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 19వ తేది వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులలో శిక్షణ పొందటానికి ప్రభుత్వ ఐటిఐ భూపాలపల్లిలోని ఖాళీగా వున్న సీట్లు భర్తీ కొరకు 6వ విడత వాక్ – ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 19వ తేది ఉదయం 11 గంటల వరకు అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు నేరుగా వాక్ ఇన్ – ఇంటర్వ్యూ ద్వారా కూడా హాజరు కావొచ్చని తెలిపారు. 17.10.2024 నుండి 19.10.2024 తేదీ వరకు ప్రభుత్వ ఐ.టి.ఐ భూపాలపల్లి, సుభాష్ కాలనీ నందు హాజరుకావాలని ఆయన సూచించారు.

**కోర్సుల వివరాలు**

మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్
కంట్రోల్ ఆటోమేషన్ ఒక సంవత్సరపు కోర్సు లో 40 సీట్లు,
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఒక సంవత్సరపు కోర్సులో 40 సీట్లు,
ఆర్టిసన్ యుసింగ్ అడ్వాన్స్డ్ టూల్స్ ఒక సంవత్సరం కాల వ్యవధి కోర్సులో 40 సీట్లు,
బేసిక్ డిసైనర్ అండ్ వర్చ్యువల్
వెరిఫైర్ (మెకానికల్)
2 సంవత్సరాల కాలపరిమితి కోర్సులో 24 సీట్లు,
అడ్వాన్స్డ్ సిఎన్సి మేషనింగ్
టెక్నీషియన్ 2 సంవత్సరాల కాల పరిమితి కోర్సులో 24 సీట్లు,



మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్
2 సంవత్సరాల కాల పరిమితి కోర్సులో 24 సీట్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేయునప్పుడు పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ, 10వ తరగతి సర్టిఫికెట్ లో ఉన్న విధంగా మాత్రమే దరఖాస్తులో నమోదు చేయాలని అన్నారు. ఫోన్ నంబర్, మెయిల్ ఐడి, ఆధార్ కార్డ్ నంబర్ దరఖాస్తులో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఆధార్ కార్డ్ మరియు 10వ తరగతి సర్టిఫికెట్ లో పేరు, తండ్రి పేరు, తల్లి పేరు మరియు పుట్టిన తేదీ విధంగా మాత్రమే ఉండాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటిఐ భూపాలపల్లి నందు కానీ లేదా మొబైల్ నెంబర్ 8985100563 నంబర్ కు కాల్ చేసి కానీ సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సమయం రెండు రోజులు మాత్రమే ఉన్నందున విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీఐ కళాశాలలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి అలాగే విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రాంతీయ ఉప సంచాలకులు బి సీతారాములు, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ జూమ్లా నాయక్, కాజీపేట కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు





**– మొదటిరోజు స్వామి వారి ఊరేగింపు, కళ్యాణ మహోత్సవం**

ఆత్మకూర్, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో శ్రీ శ్రీ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం రోజు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారి అలంకరణ ఊరేగింపు గ్రామ పెద్దలు గేర్ల వెంకట్ రెడ్డి స్వగృహం నుండి ప్రారంభమై పాండురంగ స్వామి దేవాలయం వరకు భజన కీర్తనలతో ఊరేగింపు చేశారు. అనంతరం శ్రీ పాండురంగ స్వామి రుక్మిణి మాత కళ్యాణం గ్రామ పెద్దలు శ్రీనాథ్ రెడ్డి అశ్విని కుటుంబ సభ్యులు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి ఆభరణలతో అలంకారం మహా మంగళ హారతి ప్రసాద వితరణ పలు పూజా కార్యక్రమాలు పాండురంగ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ జోషి ఆధ్వర్యంలో నిర్వహించారు.శ్రీ శ్రీ పాండురంగ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక ఆరాధన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,యుగంధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,నరసింహారెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి,భగవంతు రెడ్డి, గేర్ల వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రుద్రయ్య, గడ్డం భీమన్న, సునంద్ గౌడ్, జంగం కురుమూర్తి,మంగలి లక్ష్మన్న,ముష్టి కురుమూర్తి, నారాయణ, కృష్ణయ్య ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు భక్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): నెహ్రూ యువ కేంద్ర వరంగల్ (ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర మరియు యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘం లోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను తీసుకుని వచ్చి హన్మకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల అనగా అక్టోబర్ 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు 0870– 2958776 సంప్రదించవచ్చని చింతల అన్వేష్ జిల్లా యువజన అధికారి నెహ్రూ యువ కేంద్ర– వరంగల్ (ఉమ్మడి జిల్లాలు) 9491383832 పేర్కొన్నారు

# నాగన్నకు జాతీయ పురస్కారం అందుకోవడం ఆనందకరం

**డప్పు కళాకారుడు అమరవరపు సతీష్**

గరిడేపల్లి, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి, నేరేడుచర్ల మండల కేంద్రంలో అరుణోదయ నాగన్నకు యుద్ధగీతి సుద్దాల హనుమంతు జానకమ్మ నాగన్నకు ప్రకటించడంతో అట్టి కరపత్రాన్ని మండల కేంద్రాలలో విడుదల చేయడం జరిగింది. అరుణోదయ నాగన్నకు యుద్ధగీతి సుద్దాల హనుమంతు జానకమ్మ నాగన్నకు ప్రకటించడం హర్షించదగ్గ విషయం అని డప్పు కళాకారుడు అమరవరపు సతీష్ అన్నారు. ప్రజల పాటై ప్రజల గొంతుకై 50 ఏళ్లుగా పాటలే ప్రస్థానంగా సాగినటువంటివాడు అరుణోదయ నాగన్న సుద్దాల ఫౌండేషన్ తరపున అరుణోదయ నాగన్నకు జాతీయ పురస్కారాన్ని ఈ 19వ తారీఖున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడం జరుగుతున్నది ప్రజలు కళాకారులు కళాభిమానులు

ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామని సతీష్ అన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా పాటని విడువని పాటగాడు అరుణోదయ నాగన్న అని అమరవరపు సతీష్ కొనియాడారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి సూర్యాపేట



జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా బిక్షపతి, హుజుర్నగర్ నియోజకవర్గం బి ఆర్ యస్ నాయకులు రాపోల్ నవీన్, జీలకర్ర రామస్వామి, కర్రీ సతీష్ రెడ్డి, వీరబాబు, సైదులు, భాస్కర్, సారంగపాణి, సైదా, పిట్ట శ్రీను, ముస్తపా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించాలి

**– బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి**



నర్వ, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్ ): మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండల కేంద్రంలో గతంలో పనిచేసిన శాసనసభ్యుల నిధులతో నిర్మించిన భవన నిర్మాణం పై ఫోటో కాల్ ప్రకారం శిలాఫలకంపై పేర్లు పెట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నర్వ ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నిధులతో ఏర్పాటు చేసే పలు కార్యక్రమాలలో మరియు నిర్మించే భవనాలలో తప్పనిసరిగా ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని వారు డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమంలో టి.రామరెడ్డి, డీజే రవి, అజిత్ రెడ్డి, విజయరామ్, హనుమంతు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగనాయక స్వామి భూములను రక్షించాలి

**ఆలయ చైర్మన్ దేశ్ పాండే రాఘవేంద్రరావు**

వనపర్తి జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ గ్రామంలోని రంగనాయక స్వామి భూములను రక్షించాలని రంగనాయక స్వామి ఆలయ చైర్మన్ దేశ్ పాండే రాఘవేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా రంగనాయక స్వామి ఆలయ చైర్మన్ పెద్ద రామచంద్ర రావు వంశంలోని ఆరవ వంశస్థుడు దేశ్ పాండే రాఘవేంద్రరావు మాట్లాడుతూ గట్ల ఖానాపూర్ గ్రామానికి చెందిన పూర్వీకులు పెద్ద రామచంద్రరావు దాదాపు 457 సంవత్సరాల కింద అందాజ 1430 ఎకరాల భూమిని రంగనాయక స్వామి ఆలయ అభివృద్ధికి ప్రోత్సహించక భూమిని గ్రామంలోని ప్రజలు అలాగే పరిసర ప్రాంతాల ప్రజలు కౌలు రూపంలో పంటలు పండించుకొని శ్రీ రంగనాయక స్వామి ఆలయ అభివృద్ధికి ప్రోత్సహించాలని వీలునామాలో అమలు పరచడం జరిగిందని వారు తెలిపారు. వంశపారంపరంగా కొనసాగుతున్న రంగనాయక స్వామి భూమిని గత కొంతకాలంగా రంగనాయక స్వామి భూమిలో సాగు చేసి పంటలు పండిస్తూ ఆలయానికి తోడ్పడకపోవడమె కాకుండా అమ్మకాలకు గురిచేస్తున్నందున 2022 సంవత్సరంలో లోకయుక్తను సంప్రదించగా రంగనాయక భూమి సర్వేకు లోకయుక్త సహకరించి హైకోర్టు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ అధికారులు సర్వే నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఎండోమెంట్ అధికారులు సర్వే డిపార్ట్మెంట్ ను సంప్రదించి రంగనాయక స్వామి ఆలయ భూమి సర్వేలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. రంగనాయక స్వామి ఆలయ కమిటీకి గ్రామంలోని రైతులు సహకరించి రంగనాయక స్వామి ఉత్సవాల కార్యక్రమాలకు ప్రోత్సహించాలని వారు కోరారు. రంగనాయక స్వామి ఆలయ భూములను సర్వే చేసిన అనంతరం కౌలు రైతులకు అందజేసి పంటల ద్వారా వచ్చే కౌలు ను రంగనాయక స్వామి ఉత్సవాలకు ఖర్చు చేయడం జరుగుతుందని వారికి తెలిపారు.

**దేవదాయ భూములను అమ్మకాలకు పెడితే చర్యలు చేపడతాం రంగనాయక స్వామి దేవాలయం ఈవో సత్య చంద్రారెడ్డి**

రంగనాయక స్వామి భూములను సాగుకు నిర్వహిస్తున్న కౌలు



రైతులు అమ్మకాలకు పెడితే చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో సత్య చంద్రారెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా కొనసాగుతున్న రంగనాయక స్వామి భూములను రక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులకు ఉందని వారు తెలిపారు. రంగనాయక స్వామి ఆలయ భూములను అమ్మకం లేదా కొనుగోలు చేయడం చేస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు ఒక ప్రకటనలో హెచ్చరించారు. రంగనాయక స్వామి ఆలయ భూములకు సర్వే నిర్వహించడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకుండా గ్రామస్తులు సహకరించాలని వారు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే డిపార్ట్మెంట్ కు ఆదేశాలు జారీ చేయడంతో ఎండోమెంట్ అధికారులు సర్వే చేయడం జరుగుతుందనిబుధవారం రోజు వరకు 2వ, 4వ, 5వ, 6వ, 10వ, 11వ సర్వే నెంబర్లలో గల భూమిని సర్వే చేయడం జరిగిందని వారు తెలిపారు. ఇంకా మిగిలిన సర్వే నెంబర్లను సోమవారం వరకు పూర్తిచేయడం జరుగుతుందని వారు తెలిపారు. వీటితోపాటు కందూరు కొమిరెడ్డిపల్లి శాఖాపూర్ దేవరకద్ర మోజెర్ల మదిగట్ల తదితర ప్రాంతాలలో గల భూమిని సర్వే నిర్వహించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేశ్ పాండే రాఘవేంద్రరావు రంగనాయక స్వామి దేవాలయ ఈవో సత్య చంద్రారెడ్డి ఎండోమెంట్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి నాగేషు మారుతీ రావు కృష్ణ సర్వేయర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్ లను ఆదుకోవాలి

**డివైఎఫ్ఐ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ దొగ్గేల తిరుపతి డిమాండ్**

హనుమకొండ, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 425 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 1654 మంది గెస్ట్ లెక్చరర్ లను ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ దొగ్గేల తిరువతి హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంకు వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బలోపేతమే లక్ష్యంగా రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తు, నిరుపేద విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, చాలీచాలని జీతాలతో బ్రతుకులు ఎలా తీస్తున్న గెస్ట్ అధ్యాపకులకు, రెగ్యులర్ జేఎల్ రిక్రూట్మెంట్ తో సంబంధం లేకుండా, ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అలాగే గత నాలుగు నెలలుగా పెండింగ్



లో ఉన్న వీరి జీతాలను విడుదల చేసి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా వీరికి రూ, 42 వేతనం చెల్లించడంతో పాటు, వీరిని గెస్ట్ సిస్టం నుండి ఎంటీఎస్ గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంఘాలనుంచి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): నెహ్రూ యువ కేంద్ర వరంగల్ (ఉమ్మడి జిల్లాలు), యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి యువజన సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర మరియు యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘం లోని సభ్యుల వయసు 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలలోపు ఉండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా చేసుకోకపోయినా కూడా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను తీసుకుని వచ్చి హన్మకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో గల నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఈనెల అనగా అక్టోబర్ 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాలలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు 0870– 2958776 సంప్రదించగలరని అన్నారు.

# మాట ఇచ్చాక.. నిలబెట్టుకుంటాం..!

- 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తాం
- ఇప్పటికే 22 లక్షల తెల్ల కార్డులు కలిగిన రైతులకు రూ. 18 వేల కోట్ల మాఫీ
- 2లక్షల పైన రుణాలు ఉన్న రైతుల రుణాల మాఫీ చేసేందుకు త్వరలో షెడ్యూల్
- జనవరి నుండి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం
- త్వరలో నల్లగొండలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి
- 24 గంటల్లోనే డబ్బులను చెల్లించే ఏర్పాటు చేస్తాం
- రోడ్డు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే 31 వేల కోట్ల రూపాయల రైతుల రుణమాఫీని చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్ బి సీ బత్తాయి మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అలాగే పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గడచిన 5 సంవత్సరాలలో రైతుకు ఏ బ్యాంకులో ఎంత బాకీ ఉన్నా రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయం తీసుకున్నదని, క్యాబినెట్ నిర్ణయం ప్రకారం 22 లక్షల తెల్ల కార్డులు కలిగిన రైతులకు ఇది వరకే 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేస్తూ వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు వారి ఖాతాలలో రుణమాఫీ డబ్బులు జమచేస్తామని తెలిపారు. 2 లక్షల రూపాయల పైన రుణాలు ఉన్న రైతులకు కూడా రుణాలు మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామని, ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీని చేసి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. దీంతోపాటు, పంట కాలానికి 7500 రూపాయల రైతు బంధు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఎన్ని



ఇబ్బందులు వచ్చినా రైతు బంధు ఇస్తామని వెల్లడించారు. అలాగే ఈ సంవత్సరం నుండే రైతు పంటల బీమా ను సైతం అమలు చేస్తామని, రైతులు ఏ పంట వేసిన ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతు పంట బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో భాగంగా రైతులు ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, పత్తి ని సైతం అలాగే తేవాలని, ఈ సంవత్సరం తెలంగాణలో కోటి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండి దేశానికి అన్నం పెట్టే విధంగా తెలంగాణ తయారుకానుందని తెలిపారు. జనవరి నుండి రేషన్ కార్డుల ద్వారా అందరికీ సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని, అందుకే సన్న రకాలకు మద్దతు ధర తో పాటు, 500 రూపాయల బోనస్ వస్తుంది అని అన్నారు .

# ఇది శిక్షా కాలం కాదు శిక్షణా కాలం

- మంచి లక్షణాలతో బయటకు వెళ్ళాలి
- జ్యువైనల్ హోమ్‌లో విద్యార్థులతో సీతక్క మాటాముచ్చట
- వారితో కలిసి భోజనం
- విలువిద్యను చూసి ఆశ్చర్యపోయిన మంత్రి



హైదరాబాద్: జ్యువైనల్ హోమ్ అంటేనే పరివర్తన కేంద్రమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. తెలిసీతెలియని వయస్సులో చేసిన తప్పులతో వచ్చిన 72 మంది చిన్నారులు ఇక్కడ బాలనేరస్తులుగా ఉన్నారనీ, ఇది శిక్షా కాలంగా కాకుండా శిక్షణా కాలంగా భావించి జీవితంలో ఎదగడానికి తమను తాము తీర్చుదిద్దుకోవాలని పిల్లలకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని స్టేట్ జ్యువైనల్ హోమ్‌ను మంత్రి సీతక్క సందర్శించారు. పిల్లలు ప్రదర్శించిన విలువిద్యను చూసి మంత్రముగ్ధులయ్యారు. వారితో కలిసిపోయి తానూ బాణాలు సంధించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. నూతన వస్త్రాలను అందజేశారు. హోమ్‌లోని బాలనేరస్తులు తాము తయారు చేసిన బెడ్‌షీట్లు, కార్పెట్లు, ఇతర వస్తువులను సీతక్కకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండారు శోభారాణి, తదితరులు పాల్గొన్నారు. పిల్లలనుద్దేశించి సీతక్క మాట్లాడుతూ..ఇక్కడ నుంచి మంచి లక్షణాలు అలవర్చుకుని బయటకు వెళ్లాలని సూచించారు. అందరూ త్వరగా అమ్మానాన్నల చెంతకు చేరుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ హోమ్‌లో మానసికంగా బలోపేతమవుతూ మంచి పౌరులుగా ఎదిగి పేరుతెచ్చుకోవాలని దీవించారు. పిల్లలు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. మానవతా దృక్పథంతో హోమ్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. సొంతపిల్లల్లాగా భావించి వారి ఎదుగుదలకు సహకరించాలని కోరారు. త్వరలో ఇక్కడ గ్రంథాలయం, యోగ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. హోమ్‌లో పిల్లలకు కావాల్సిన విద్యను అందిస్తున్నామనీ, వృత్తిపరమైన కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. టాటా టెక్నికల్ సపోర్ట్‌తో సాంకేతిక పరిజ్ఞానం నేర్పిస్తున్నామని చెప్పారు. విలువిద్యలో నేషనల్ గేమ్స్ వరకు విద్యార్థులు వెళ్లడం అభినందించాల్సిన విషయమన్నారు. బాలనేరస్తుల్లో సత్ప్రవర్తన తీసుకొచ్చి త్వరలోనే ఇంటికి పంపిస్తామన్నారు.

# అదానీ సిమెంట్‌తో అపాయం

- ప్రజారోగ్యం, పర్యావరణానికి ప్రమాదం
- ఎన్ఐటీ విశ్రాంత ప్రొఫెసర్ రామచంద్రయ్య
- ప్రతిఘటించకపోతే భవిష్యత్ లేదు : 'పట్నం' రాష్ట్ర కార్యదర్శి డిజి
- రామన్నపేటలో అఖిలపక్షం, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సదస్సు



రామన్నపేట: ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే సిమెంటు పరిశ్రమ ఏర్పడితే దాని కాలుష్యం ఫలితంగా జీవకోటి మనుగడకు ముప్పు తప్పదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్రాంత ఆచార్యులు ఎ.రామచంద్రయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అదానీ గ్రూపు అంబుజా సిమెంటు పరిశ్రమను వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక రహదారి బంగ్లాలో అఖిలపక్ష పార్టీలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. 600 మంది వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ.. సిమెంటు పరిశ్రమ ద్వారా ఎగిసిపడే దుమ్ము, దూళితో వాయు, శబ్ద, జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రజా జీవనవ్యవస్థను స్తంభింపజేసే సిమెంటు పరిశ్రమకు వ్యతిరేకంగా ముందుగానే రాజకీయాలకతీతంగా పోరాడాలన్నారు. సిమెంట్‌లో కలిపే రసాయనాల మూలంగా ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పరిశ్రమ ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందనే ప్రచారం అశాస్త్రీయమన్నారు. గ్రామాల అభివృద్ధి తిరోగమనంలో ఉంటుందన్నారు. పచ్చని పొలాల్లో మంటలు పెట్టి భూముల ధరలు తగ్గించే కుట్రకు బలి కావద్దన్నారు.

సిమెంటు పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాలైన జిప్సం, స్లాగ్, క్లింకేర్, బొగ్గు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వంటి ప్రతిరోజూ గాలిలో కలవడంతో ప్రాణాంతక ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. చర్మ రోగాలు, గర్భస్రావాలు, చిన్నపిల్లల్లో ఎదుగుదల లోపించడం, కంటి చూపు మందగించడం, అంగవైకల్యం వంటి వ్యాధులు ప్రబలుతాయని, గ్రామీణ వృత్తులు దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రజా ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని దెబ్బతీసే కాలుష్య పరిశ్రమకు వ్యతిరేకంగా ముక్తకంఠంతో పోరాడి భవిష్యత్ తరాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి : జిల్లాలో మాదకద్రవ్యాలను నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి



చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు గా మారితే వచ్చే పరిణామాలు, మాదకద్రవ్యాల బానిసత్వం నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగాచర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు.

## ఈనెల 19న దిశా కమిటీ సమావేశం

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబర్ 16 (తీన్మార్ న్యూస్): ఈనెల 19వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఐడిఓసి కార్యాలయంలో దిశా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్ పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామ రెడ్డి , జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, జడ్పీ చైర్మన్, శాసనమండలి, శాసనసభ్యులు, దిశా కమిటీ సభ్యులు మరియు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ యొక్క సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలలో చేపడుతున్న పనుల పై నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

# బెట్టింగ్ లు ,ఆన్లైన్ గేమ్స్ లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న యువకులు

- రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకులమైలారం లో చోరీ
- ఆన్లైన్ లో పరిచయమై దొంగతనాల బాటపట్టిన నిందితులు
- చోరీ కేసు ఛేదించిన గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు

ఇబ్రహీంపట్నం: చదువుకున్న యువకులు బెట్టింగ్ లు ,ఆన్లైన్ గేమ్స్ లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతుండగా పోలీసులు పట్టుకొని రిమాండ్ కు తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపి కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం రామన్నగూడెం కు చెందిన ఉటుకూరి ప్రభాస్ తాత్కాలికంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ లో ఉంటూ కరీంనగర్ లో బీటెక్ చదువుతూ ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడి లాస్ అయ్యాడు, మరొకరు నల్గొండ జిల్లా శాలిగౌరరం గ్రామానికి చెందిన గుండ్లపల్లి శివ మెడికల్ షాప్ వర్కర్ గా పనిచేస్తూ ఆన్లైన్ బెట్టింగ్ ఆడుతూ లాస్ అయ్యాడు. వీరిద్దరూ ఒకరికొకరు ఆన్లైన్ ఇన్స్టా గ్రామ్ లో పరిచయమయ్యారు. సులభమార్గంలో డబ్బులు సంపాదించడం కోసం చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. 10వ తేదీన ఒక బ్లూ కలర్ బేలానో (టీజీ07జీ8635) ను కిరాయికి తీసుకున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధుల నివాసాలను రిక్కి నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలో ఒంటరిగా వృద్ధురాలు దేవరశెట్టి సుమతమ్మ ఇంట్లోకి ప్రవేశించి ఆమె నోరు మూసి ఒలరు పట్టుకోగా మరొకరు మెడలో, చేతులకు 6 తులాల బంగారు ఆభరణాలు(4-బంగారు గాజులు, రెండు తులాల పుస్తెల తాడు)ను కత్తెరతో కత్తిరించుకొని చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి చాకచక్యంగా ఇద్దరు నిందితులను ఈ రోజు పట్టుకొని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. వారినుండి బంగారు ఆభరణాలు, కారు, ఐ ఫోన్, కత్తెర స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. ఉన్నత చదువులు చదివి ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడి సులభ మార్గాల్లో డబ్బులను సంపాదించుటకు యత్నించడం మనేయ్యలని సూచించారు. ఎలాంటి నేరం చేసిన పోలీసుల కు చిక్కగా తప్పదన్నారు. చేడు మార్గాల్లో డబ్బులు సంపాదించడం మనేయ్యలని, ఇది తల్లిదండ్రులు, యువకులు గుర్తుంచుకోవాలన్నారు. ఒంటరి మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిందితులను పట్టుకోవడం లో చాకచక్యంగా వ్యవహరించిన గ్రీన్ ఫార్మా సిటీ సిఐ కృష్ణమ్ రాజు, సిబ్బందిని ఏసీపి అభినందించి రివార్డులను అందజేశారు.

# సి ఎం ఆర్ లక్ష్యలను నూరు శాతం సాధించాలి

భూపాలపల్లి, సి.ఎం.త్ లక్ష్యాలను నూరు శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మిల్లర్లను ఆదేశించారు

మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సి ఎం ఆర్, ఖరీఫ్ దాన్యం కేటాయింపు, మిల్లులు ట్యాగింగ్, మార్కెట్ కమిటీ లైసెన్సులు తదితర అంశాలపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార శాఖ, రైస్ మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సి ఎం ఆర్ లక్ష్యం 77.46 శాతం పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సి ఎం ఆర్ ప్రక్రియపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మిల్లర్లు మార్కెట్ కమిటి లైసెన్స్ పొందాలని అన్నారు.

మిల్లర్లు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ధాన్యం సేకరణ, బియ్యం సరఫరా సక్రమంగా జరుగుతుందని ఆయన అన్నారు. సి.ఎం.ఆర్ లక్ష్యాలను సాధించడం చాలా ముఖ్యమని, ప్రభుత్వానికి సహకరించడం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడగలరని కలెక్టర్ తెలిపారు. సి ఎం ఆర్ లో పాల్గొనే ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా రెండు వేర్వేరు రిజిస్టర్లను నిర్వహించాలని అన్నారు. ఏ సమయంలోనైనా పరిశీలనకు అందించాలని పేర్కొన్నారు. దాన్యం కోనుగోలు గురించి మాట్లాడుతూ ట్యాగ్ చేయని కొనుగోలు కేంద్రాల నుండి



దాన్యం స్వీకరించొద్దని, కేటాయించిన మేరకు మాత్రమే దాన్యం స్వీకరించాలని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకంలో జాగ్రత్తలు పాటించాలని, టోకెన్ కేటాయించాలని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయడానికి తగినంత స్థలంతో పాటు దిగుమతి చేసేందుకు హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, మార్కెటింగ్ డిఎం కనక శేఖర్, సహకార అధికారి వాలియా నాయక్, రైస్ మిల్లర్లు సంగం అధ్యక్షులు తిరుపతి, రైస్ మిల్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయాలి

- కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం
- గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలింపు



జోగులాంబగద్వాల: తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణి సంద ర్భంగా కలెక్టరేట్లో రైతు ఆత్మహత్యా యత్నం చేశారు. ఈ ఘటన సోమవా రం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరే ట్‌లో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన పొలాన్ని తహసీల్దార్ వేరే వారిపై రిజి స్టర్ చేశారంటూ అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన రైతు పరుశరాముడు పలుమార్లు అధికారులను కలిసి మొరపెట్టుకున్నాడు. తన భూమిని తనపై మార్చాలని వేడుకున్నాడు.

ఫలితం లేకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన పరుశరాముడు పురుగుల మందు తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే రైతుని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరుశరాముడు జులైలోనూ ఓ సారి ప్రజా వాణిలో పురుగుల మందు తాగాడు. అంతేకాక స్వస్థలం గుడిదొడ్డి గ్రామం నుంచి కుటుంబ సభ్యులంతా కలిసి కాలినడకన హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలోనూ వినతిపత్రం ఇచ్చారు. అయిన

# ఢిల్లీలో ధర్నాకు బీఆర్ఎస్ ప్లాన్

హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ పార్టీ ఫోకస్ పెట్టింది. హామీల అమలుపై ఢిల్లీ కేంద్రంగా భారీ ఆందోళన చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ రెడీ అవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఢిల్లీలో అగ్రనేత రాహుల్ గాంధీ నివాసం ముందు భారీ ధర్నా చేయాలని గులాబీ పార్టీ నిర్ణయించింది.గత బీఆర్ఎస్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలకు తోడు భారీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చింది. కీలకంగా 6 గ్యారెంటీలు, 11 హామీలు అంటూనే.. మొత్తం 420 వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోతో తెలంగాణలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు స్కీమ్ ను యుద్ధ ప్రాతిపదికన అమలు చేసింది రేవంత్ సర్కార్. మిగిలిన కీలక హామీలను అమలు చేయడంలో విఫలమైందని గులాబీ పార్టీ ఆరోపిస్తోంది.

కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేతులెత్తేసిందని, తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ హామీల అమలును గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది. తాజాగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ హైకమాండ్ కు వినిపించేందుకు బీఆర్ఎస్ ప్రణాళికలు వేస్తోంది.రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటి నుంచి కేసీఆర్ ప్రజాక్షేత్రంలో పెద్దగా కనిపించలేదు. ఆ తరువాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రచారం చేశారు. అభ్యర్థుల తరఫున నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఒకప్పటి కేసీఆర్‌ను తలపించేలా ప్రసంగాలు చేశారు. కానీ.. ఆ ఎన్నికల్లోనూ పెద్దగా ఫలితాలు రాలేదు. బీఆర్ఎస్ పార్టీకి కనీసం ఒక్కటంటే ఒక్క సీటు కూడా రాలేదు. ఒక్క అభ్యర్థి కూడా ఎంపీగా గెలవలేకపోయారు. ఇక అప్పటి నుంచి కేసీఆర్ పూర్తిగా ఫాంహౌజ్‌కే పరిమితం అయ్యారు.ఇప్పటివరకు ప్రభుత్వ వైఫల్యాలపై కానీ.. ప్రజాసమస్యలపై కానీ ఒక్క స్టేట్‌మెంట్ కూడా కేసీఆర్ నుంచి రాలేదు. అటు వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడ్డా నోరు మెదపలేదు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఆయన వైఖరి చర్చకు దారితీసింది. ప్రజల్లోనూ కేసీఆర్‌కు ఏమైంది అన్నట్లుగా చర్చ నడిచింది. కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా కేసీఆర్ కనిపించడం లేదంటూ పోస్టర్లు వేశారు. రకరకాల కామెంట్లు చేస్తూ వచ్చారు. అటు సీఎం రేవంత్ కూడా చాలా సందర్భాల్లో కేసీఆర్ ఓ అప్పీల్ కూడా చేశారు. సీనియర్ నేతగా తమకు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. పాలనాపరంగా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కానీ.. కేసీఆర్ మాత్రం ఒక్కసారి కూడా బయటకు రాలేదు. కేవలం బడ్జెట్ సమావేశాల వేళ మాత్రం ఒక్కరోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరై వెళ్లిపోయారు. ఇక ఆ తరువాత కనిపించలేదు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.సుదీర్ఘ విరామం తరువాత కేసీఆర్ రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ కాబోతున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే డిసెంబరు నుంచే ఆయన తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు వ్యూహాలు సిద్ధం చేసినట్లుగా సమాచారం. డిసెంబరు నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తికానుంది. దాంతో ఏడాది పాలనపై కేసీఆర్ ప్రశ్నించబోతున్నారని తెలుస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యలను ఎజెండాగా మార్చుకొని రాజకీయాల్లో పుంజుకునేందుకు వ్యూహాలు రచించారని సమాచారం. సంక్రాంతి తరువాత రాష్ట్రంలో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా అడుగులు వేయబోతున్నారు.కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని కేసీఆర్ ముందు నుంచీ అనుకున్నారు. ఎట్టకేలకు ఏడాది పూర్తి కావస్తుండడంతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారట. దీనిపై ఇప్పటికే పార్టీ నేతలతో చర్చించారు. నిత్యం కేసీఆర్‌తో భేటీ అవుతున్న నేతలకు కూడా ప్రజా సమస్యలపై పోరాడాలంటూ సూచిస్తూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను కూడా వేగంగా నడిపించాలని కార్యకర్తలకు చెబుతూ వచ్చారు. ముఖ్యంగా పార్టీలోకి యువ రక్తం వచ్చేలా ప్లాన్ చేయాలని సూచించారు.

ఇప్పుడు ప్రజల్లోకి వచ్చాక వీటన్నింటికీ కార్యాచరణ ప్రారంభించేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అయితే, త్వరలో మహారాష్ట్ర సహా మరిన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగను న్నాయి.ఈ క్రమంలో ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అనే తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని కొందరు బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది సందర్భంగా ధర్నా నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయం మరికొందరు గులాబీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, దసరా పండుగ పూర్తి కావడంతో పార్టీ అధినేత కేసీఆర్ ఢిల్లీలో ధర్నాపై నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. హస్తినలో బీఆర్ఎస్ ధర్నాపై కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని పార్టీ నేతల్లో చర్చ మొదలైంది.

# గులాబీలో నెంబర్ 2 రచ్చ... చర్చ...

మెదక్: పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించింది బీఆర్ఎస్ పార్టీ. ఇన్నేళ్లలో అటు ఆర్థికంగా, ఇటు రాజకీయంగా చాలా బలపడింది. కానీ, రాను రాను కేసీఆర్ గ్రాఫ్ దిగజారిపోవడం, ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడంతో 2023 ఎన్నికల్లో ఓటమిపాలైంది. అధికారంలో ఉన్న రోజుల్లోనే పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది నెంబర్ 2 పొజిషన్. కేసీఆర్ తర్వాత ఎవరు అనే చర్చ వచ్చిన సందర్భంలో, అటు కేటీఆర్, ఇటు హరీష్ రావు వర్గీయుల మధ్య కోల్డ్ వార్ నడిచింది. కొన్ని సందర్భాల్లో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు కొందరు బహిరంగంగానే కేటీఆర్ సీఎం అవుతారని ప్రకటనలు చేశారు. అయితే, హరీష్ రావు మాత్రం ఎప్పుడు ఛాన్స్ వచ్చినా వదలకుండా తన కర్తవ్యాలను నిర్వర్తిస్తూ వస్తున్నారు. సైలెంట్‌గా క్యాడర్‌లో, జనంలో బలం పెంచుకుంటున్నారు. కానీ, అధికారం కోల్పోయిన దగ్గర నుంచి నెంబర్ 2 వార్ పీక్స్‌కు చేరిందనే అనుమానాలున్నాయి. దీనిపై గ్రామస్థాయిలో జోరుగా చర్చలు జరుగుతున్నాయిజపదేళ్లు సీఎంగా కొనసాగిన కేసీఆర్, మూడోసారి జరిగిన ఎన్నికల్లో ఓటమితో సైలెంట్ అయిపోయారు. ఆరోగ్య కారణాలతో కొన్నాళ్లు ఎవరికీ కనిపించలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొద్ది రోజులు బయటకు వచ్చారు. తర్వాత మళ్లీ మామూలే. ఫాంహౌస్‌కే పరిమితం అయ్యారు. ఆఖరికి అసెంబ్లీలో మౌనముని అవతారం ఎత్తారు. బడ్జెట్ సమావేశాల్లో ఒక్క రోజు మాత్రమే హాజరై, అటు తిరిగి చూసింది లేదు. వరదల సమయంలో జనం అల్లాడిపోతున్నా కేసీఆర్ బయటకొచ్చింది లేదు. సరిగ్గా ఇదే సమయాన్ని బాగా క్యాష్ చేసుకున్నారు హరీష్ రావు. పార్టీ అధినేత సైలెంట్‌గా ఉండడంతో కేటీఆర్ కంటే ముందే అన్ని విషయాల్లో రియాక్ట్ అవుతూ, ప్రతిపక్ష నేత పాత్ర పోషించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వ చర్యలను తప్పుబడుతూ కేటీఆర్ కన్నా హరీష్ రావు దూకుడుగా వ్యవహరించారు. పార్టీ నేతలను వెంటబెట్టుకుని ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారు. బాధితులను పరామర్శించారు. తానున్నాననే భరోసాను కల్పించే ప్రయత్నం చేశారు. అంతేకాదు, నిత్యావసర సరుకులను సిద్దిపేట నుంచి లారీలలో తరలించారు. ఆ సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల నేతలతో నిత్యం టచ్‌లో ఉంటూ ముందుకు సాగారు. ఇక్కడే కేటీఆర్ కన్నా హరీష్ రావుకు ఎక్కువ మార్కులు పడ్డాయి. తర్వాత పాడి కౌశిక్ రెడ్డి, అరెకపూడి గాంధీ వ్యవహారం తెరపైకి వచ్చింది. కౌశిక్ రెడ్డి వెనుక ఉండి అంతా నడిపించారు హరీష్ రావు. ఎమ్మెల్యేతో కలిసి ధర్నా కూడా చేశారు. క్యాడర్‌లో జోష్ నింపేందుకు ప్రయత్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎంతో ఆర్భాటంగా మూసీ ప్రక్షాళన ప్రకటించారు కేసీఆర్. కానీ, జరిగింది ఏం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అదే ప్రాజెక్టును చేపట్టి, పనులు వేగంగా జరిగేలా రేవంత్ సర్కార్ వ్యవహరిస్తోంది. నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేస్తోంది.

అయితే, దీని చుట్టూ కూడా హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ అనేలా కోల్డ్ వార్ కొనసాగుతోంది. నిర్వాసితుల పలకరింపులోనూ ఇద్దరు నేతలు పోటీపడి మరీ వెళ్లారు. ఎప్పటిలాగా ముందుగానే రియాక్ట్ అయిన హరీష్ రావు, బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. అయితే, కేటీఆర్ తానేమన్నా తక్కువా అన్నట్టు ఒకటికి రెండు సార్లు పర్యటనలు చేసి హీట్ పెంచారు. ఇలా ఒకటా రెండా, చాలా విషయాల్లో హరీష్ రావు, కేటీఆర్ మధ్య సైలెంట్ వార్ నడుస్తోంది. మొన్న మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి బాధ్యతలు చేపట్టిన సందర్భంలో కేటీఆర్, హరీష్ వెళ్లారు. కానీ, కలిసి కనిపించింది లేదు. వేర్వేరుగా వెళ్లి బొకేలు ఇచ్చి వచ్చేశారు. ఇవన్నీ గమనిస్తున్న కిందిస్థాయి క్యాడర్ కన్ఫ్యూజన్‌లో పడిపోయింది.బీఆర్ఎస్ రెండోసారి గెలిచి అధికారం చేపట్టాక హరీష్ రావును దూరం పెట్టారు కేసీఆర్. దీనిపై అనేక చర్చలు జరిగాయి. నెంబర్ 2 పొజిషన్ కేటీఆర్‌కు ఫిక్స్ చేయాలనే లక్ష్యంతోనే హరీష్‌కు కేసీఆర్ పదవి ఇవ్వలేదని అంతా అనుకున్నారు. అయితే, తమ నాయకుడికి పదవి రాలేదని అనుచరులు కాస్త ఓవర్‌గా రియాక్ట్ అయ్యారు. ఇదంతా హరీష్ కనుసన్నల్లోనే జరుగుతోందన్న కబురు కేసీఆర్‌కు చేరింది. అంతకుముందు పాస్ పోర్టు కేసులో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిని అరెస్ట్ చేశారు. దీనిని బూచిగా చూపిస్తూ హరీష్ రావును కూడా బెదిరించారనే ప్రచారం సాగింది. గతంలో హరీష్ రావు భార్య, కూతురు పేర్ల మీద దొంగ పాస్ పోర్టులతో గుజరాత్ మహిళలను అమెరికా పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అయితే, ఇప్పుడు బీఆర్ఎస్ అధికారంలో లేదు. కేసీఆర్ అంత యాక్టివ్‌గా లేరు. ఈ నేపథ్యంలో హరీష్ రావు దూకుడుగా వ్యవహరిస్తున్నట్టు గ్రామస్థాయిలో చర్చ జరుగుతోంది. దీంతో ఎప్పుడేం జరుగుతుందో అనే టెన్షన్ వారి మాటల్లో వినిపిస్తోంది. త్వరలోనే కేసీఆర్ బయటకు వస్తారని అంటున్నారు. మరి, ఆయనొస్తే ఏమైనా మార్పు ఉంటుందేమో అనే ఆశలో ఉన్నారు. అయితే, అప్పుడు కేసీఆర్ పవర్‌లో ఉన్నారని సైలెంట్ అయిన హరీష్ రావు, ఇప్పుడు చెప్పిన మాట వినకపోవచ్చు కానీ, పాత కేసు సీబీసీఐడీ చేతిలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెడితే పరిస్థితి ఏంటనే చర్చ కూడా జరుగుతోంది.

# కెనడా భారత్ దేశాల మధ్య భగ్గుమన్న దౌత్యయుద్ధం

**- ఇరుదేశాల మధ్య మరోసారి నిప్పు రాజేసిన నిజ్జర్ హత్యోదంతం**

**- కెనడాలోని రాయబారుల భద్రతకు ముప్పు ఉందన్న భారత్**

**- దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించుకోవాలని నిర్ణయం నిజ్జర్**

**- కెనడా దౌత్యవేత్తలకు భారత్ అల్టిమేటం**



న్యూఢిల్లీ: భారత్, కెనడాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తి స్థాయిలో బెడిసికొట్టాయి. కెనడాలోని ఖలీస్థానీ వేర్పాటువాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యోదంతం ఇప్పుడు ఇరుదేశాల మధ్య తిరిగి చిచ్చు రగిల్చింది. కెనడా నుంచి తమ దేశ దౌత్య ఉన్నత ప్రతినిధి హై కమిషనర్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత కెనడా పట్ల తమ వైఖరిని కఠినతరం చేసింది. కెనడాకు చెందిన ఆరుగురు దౌత్యవ్తే లు శనివారం లోగా బారతదేశం విడిచిపెట్టి వె ళ్లాలని ఆదేశించింది. మరో వైపు కెనడా కూ డా తమ దేశంలోని ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించింది. వీరు మోడీ ఏజెంట్లు అని, కెనడాలో వీరు సాగిస్తున్న క్రిమినల్ కార్యకలాపాలపై తగు సాక్షాధారాలు, సమాచారం తమ వద్ద ఉన్నాయని కెనడా పోలీసు వర్గాలు ప్రకటించాయి.దీనిని ప్రాతిపదికగా చేసుకుని రాయబారులను తాము బయటకు పంపిస్తున్నట్లు కెనడా ప్రభుత్వం ప్రకటించింది. పరస్పర ఆరోపణలు, దౌత్యవేత్తల బహిష్కరణలతో ఇప్పుడు ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు పూర్తిగా తెగినట్లు అయ్యాయి. భద్రతా కారణాల వల్ల వెంటనే ఇండియా హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మను తిరిగి రప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు భారత ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇది తాము ముందుగా తీసుకుంటున్న చర్య కాదని, కెనడా ప్రభుత్వం నిజ్జర్ హత్య కేసు విచారణలో కెనడాలోని భారతీయ హై కమిషనర్‌ను అనుమానితుడిగా ప్రకటించడం, ఆయనపై దర్యాప్తు అవసరం ఉందని తెలియచేయడం కవ్వింపు చర్య అని భారత విదేశాంగ శాఖ సోమవారం మండిపడింది. అక్కడి ఉగ్రవాది హత్య ఎందుకు జరిగిందనేది సరైన రీతిలో ఆరా తీయకుండా, భారతదేశంపై అనుమానాలు వ్యక్తం చేయడం, ఈ క్రమంలో చివరికి హైకమిషనర్ కూడా విచారణ వ్యక్తుల జాబితాలో ఉన్నట్లు తెలియచేయడం అసాధారణ చర్య అవుతుందని భారత ప్రభుత్వం ధీటుగా స్పందించింది.ప్రస్తుత పరిస్థితుల్లో కెనడాలోని భారత హై కమిషనర్‌కు కానీ సిబ్బందికి కానీ అక్కడి ప్రస్తుత ప్రభుత్వం సరైన రక్షణ ఇస్తుందనే నమ్మకం లేదు. ఇందుకు అవసరం అయిన కట్టుబాట్లకు కూడా వారు దిగుతారని తాము అనుకోవడం లేదని, ఈ దశలో హై కమిషనర్ భద్రతను పరిగణనలోకి తీసుకుని వెంటనే వెనకకు పిలిపించాలనే నిర్ణయానికి వచ్చినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విషయాన్ని తాము సోమవారం సాయంత్రం కెనడాకు చెందిన దౌత్య వ్యవహారాల ఇన్‌చార్జికి తెలియచేసినట్లు కూడా విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది. అక్కడి ట్రూడో ప్రభుత్వం చర్యలు దౌత్య సిబ్బంది భద్రతకు అనుగుణగా లేవు. అక్కడ పూర్తి స్థాయిలో తీవ్రవాదం, అంతకు మించిన వేర్పాటువాద ఉగ్రవాదం పెచ్చరిల్లింది. సంబంధిత హింసాకాండ ప్రమాదకరం అయిందని విదేశాంగ మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో తెలిపింది. ఇప్పుడు భారత్‌కు వేరే దారి లేదు. అక్కడి రాయబారిని వెంటనే స్వదేశానికి తిరిగి తీసుకురావడం కీలకం అయిందని వివరించారు. తమకు అందిన సమాచారం మేరకు కెనడాలో హై కమిషనర్, కొందరు దౌత్యవేత్తలను ఉగ్రవాదులు తమ హిట్‌లిస్టులో పెట్టుకున్నట్లు, ఈ మేరకు వారి వద్ద నిర్ధేశిత జాబితా ఉన్నట్లు తెలిసిందని, ఈ పరిస్థితుల్లో వారందరిని ఇక్కడికి తీసుకురావడం కీలక విషయం అయిందని విదేశాంగ శాఖ తెలిపింది. తమ దేశ పౌరుడు అయిన నిజ్జర్ పూర్వాపరాల సంగతి పక్కన పెడితే తమ దేశ పౌరుడి హత్య జరిగినందున , దీని వెనుక భారతదేశ నిఘా సంస్థలు ఇతర అధికారుల హస్తం ఉందని భావించినందున తాము సంబంధితులందరిపైనా దర్యాప్తు జరిపి తీరుతామని పలుసార్లు కెనడా ప్రధాని ట్రూడో చెపుతూ వచ్చారు. ఇప్పుడు తాజాగా భారత హై కమిషనర్ పాత్రపై దర్యాప్తు జరుగుతున్నట్లు , ఆయన తమ పర్సన్ ఆఫ్ ఇంట్రెస్టు జాబితాలో ఉన్నట్లు కెనడా ప్రకటించడంతో ఇంతవరకూ అంతర్గతంగా రగులుకుంటున్న వివాదం ఇప్పుడు మరింత భగ్గు మంది.సోమవారం పలు కీలక పరిణామాలు చకచకా జరిగాయి. సోమవారం సాయంత్రం కెనడా రాయబారి స్టీవర్ట్ వీలర్‌కు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్లు వెలువరించింది. ఆయనను పిలిపించి కెనడా ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని నిలదీసింది.కెనడాలో ఓటు బ్యాంక్ రాజకీయాల్లో లబ్ధి కోసం ప్రధాని ట్రూడ్ అచారక రీతిలో దౌత్యవేత్తలపై తప్పుడు ఆరోపణలు చేస్తే, చివరికి హత్యోదంతం, అందులోనూ ఓ ఉగ్రవాది అంతం విషయంలో ఏకంగా హై కమిషనర్, ఆయన పరిధిలోని దౌత్య సిబ్బందిని అనుమానితులుగా పేర్కొనడం గర్హనీయం అని తెలిపారు. ఆతరువాత హై కమిషనర్ ఉపసంహరణ నిర్ణయం ప్రకటించారు.

# బస్టాండ్ లో మౌలిక వసతులు కల్పించాలి



భిక్కనూర్: భిక్కనూరు పట్టణ కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ లో మౌలిక వసతులు కల్పించాలని హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి రవీందర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరాను కోరారు. బుధవారం డిపో మేనేజర్ తో మాట్లాడుతూ బస్టాండ్ లోకి ప్రతి ఒక్క ఆర్టీసీ బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులు అయిన త్రాగునీరు మరుగుదొడ్లు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ లైట్లు, బస్టాండ్ మరమ్మత్తు పనులు చేపట్టాలని డిపో మేనేజర్ ని కోరినట్లు తెలిపారు. అనంతరం డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆర్టీసీ బస్టాండ్ లోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# అంగన్వాడి భవనానికి నిధులు విడుదల చేయండి.

కమాన్ పూర్: రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని వకీల్ పల్లె ప్లాట్ లలో అంగన్వాడి కేంద్రానికి నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.

రామగిరి మండలం సెంట్రనేరి కాలనీ వకీల్ పల్లె ప్లాట్స్ నూతన ఆర్ అండ్ ఆర్ కాలనీ ఇప్పటివరకు అంగన్వాడి అదే భవనం లో పాఠశాల నిర్వహణ చేస్తున్నారని గ్రామము సింగరేణి ప్రభావిత ప్రాంతమని గతంలో వీరికి అంగన్వాడి కేంద్రం నిర్మాణం కొరకు ఆర్ అండ్ ఆర్ నిధులు మంజూరు అయినప్పటికీ భవన నిర్మాణం చెయ్యలేదు. కనీసం భూమి పూజ కూడా నోచుకోని ఆర్ అండ్ ఆర్ గ్రామ ప్రజలు అద్దె భవనంలో పిల్లలకు ఇబ్బంది అవుతుందని ఐటి మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు కి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ప్రజలు స్కూల్ భవనం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీరికి సొంత అంగన్ బడి నిర్మాణ కేంద్రం కావాల్సిన నిధులు ఇప్పించగలరని పెద్దపల్లి కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ జల్లారం మాజీ ఎంపిటిసి బానోత్ చందు తదితరులు పాల్గొన్నారు.

# ఆ' ఐడియా'మూగజీవాలకు వరం.

కమాన్ పూర్: ఆ రైతు ఐడియా మూగజీవాలకు వరంగా మారింది. మనకు వర్షాకాలంలో దోమలు కుడితే దోమలను పారదోలెందుకు ఎన్నో ఉపయోగాలు వేస్తాం.

మనకు దోమలు కుట్టకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. కానీ మూగజీవాలకు ఆరు బయట కట్టి వేయడంతో వాటికి దోమలు కుట్టి ఎంతో ఇబ్బందులకు గురవుతుంటాయి. అలాగే పాల శాతం సైతం తగ్గుతుంది. కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన అన్నవేన రాజయ్య అనే రైతు తమ గేదెలకు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. దీనిలో భాగంగా తామ గేదెల గుడిసెకు పూర్తిగ దోమల తెర కట్టి వాటికి దోమల కుట్టకుండా జాగ్రత్త తీసుకున్నాడు. మనం సైతం మూగజీవాలకు ఇటువంటి సౌకర్యాలు కలిగిస్తే మూగజీవాల దీవెన సైతం మనకు ఉంటుందని ఆశిద్దాం.

# విషాదం.. గుండెపోటుతో ఐదేళ్ల చిన్నారి మృతి..



హైదరాబాద్: కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. గుండెపోటుతో ఐదేళ్ల చిన్నారి కన్నుమూసింది. వివరాలోకి వెలితే.. జమ్మికుంటకు చెందిన రాజు–జమున దంపతులకు ఉక్కులు (5) అనే కూతురు ఉంది. మంగళవారం ఉదయం నిద్రలేచిన బాలిక కాసేపు ఆడుకున్న తర్వాత కళ్లు తిరుగుతున్నాయని తల్లికి చెప్పింది. దీంతో బాలికను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు.. పరిస్థితి విషమంగా ఉండటంతో హన్మకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో హుటాహుటిన బాలికను హన్మకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షిస్తుండగానే చిన్నారి మృతి చెందింది. కాగా, చిన్నారికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని.. ఆ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించలేకపోయారని వైద్యులు తెలిపారు. అందువల్లే గుండెపోటు వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె మరణవార్త వినగానే ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



భిక్కనూర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో సొసైటీ చైర్మన్ రాజా గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, బి గ్రేట్ ధాన్యానికి రూ. 2300 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కాచాపూర్ సొసైటీ చైర్మన్ కృష్ణ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ స్వామి, వ్యవసాయ అధికారి రాధ, ఏ ఈ ఓ లతా, సొసైటీ సీఈవో మోహన్ గౌడ్, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షలకు పైగా సభ్యత్వ నమోదు

నిర్మల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నేడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఓఎఅ రాంచంద్రరావ్, క్యాంప్ కార్యాలయం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 20 లక్షలకు పైగా సభ్యత్వ నమోదు జరిగిందని, 50 లక్షల టార్గెట్ ను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.

# జనవరిలో లోకల్ బాడీ ఎలక్షన్స్

హైదరాబాద: తెలంగాణలో బీసీల కులగణనకు ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి.తాజాగా బీసీలతో పాటే ఎస్సీ, ఎస్టీల కులగణన సర్వే సైతం చేపట్టేందుకు సర్కార్ ఒకే చెప్పేసింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఇక స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ఇప్పట్నుంచే ఎన్నికలకు సన్నద్ధం అవడం ప్రారంభించారు.దసరా పండుగకు ఒక్కరోజు ముందే సర్కారు కులగణన సర్వేకు సంబంధించిన జీఓ 18ను జారీ చేసింది. ఫలితంగా లోకల్ బాడీస్ అభ్యర్థుల్లో సంతోషం నెలకొంది. ఇదే అవకాశమని భావించి, దసరా పండుగ రోజున తమ ఉనికిని చాటేందుకు పెద్ద ఎత్తున తమ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేశారు.మరోవైపు బీసీ కులగణన లేకుండా గ్రామ పంచాయతీకి ఎన్నికలను నిర్వహించొద్దని ఓవైపు బీఆర్ఎస్, ఇంకోవైపు బీజేపీలు పట్టుబట్టాయి. ఇక బీసీ సంఘాలు అయితే రిజర్వేషన్లు తేలకుండా ఎన్నికల ప్రస్తావన తీసుకురాకూడదని అల్టిమేటం జారీ చేశాయి.ఒకదశలో బీసీ సంఘాలు హైకోర్టును సైతం ఆశ్రయించాయి. పిటిషన్లను విచారించిన ఉన్నత న్యాయస్థానం, బీసీ కులగణన చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం సూచనల మేరకు ప్రభుత్వం స్పందించింది. ఈ క్రమంలోనే కులగణన పూర్తైన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అసలు లోకల్ బాడీస్ అంటేనే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు. పల్లెల్లో కీలకమైన ఈ ఎన్నికలపై ఈసారి బీసీలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి 4న జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని సైతం ప్రవేశపెట్టింది. ఇదే సమయంలో బీసీ కులగణనపై పలు రాష్ట్రాల్లోని స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం అధికారులను పంపించింది. ఈ సందర్భంగా అధ్యయనం వివరాలు ప్రభుత్వానికి అందడంతో కులగణనకు సర్కారు పచ్చజెండా ఇచ్చేసిందికులగణన బాధ్యతను ప్రభుత్వం ప్రణాళిక శాఖ భుజంపై మోపింది. కులగణన పూర్తయ్యే వరకు ప్రణాళికా శాఖనే నోడల్ ఏజెన్సీగా బాధ్యతలు నిర్వర్తించనుంది. బీసీ కులగణనకు అధనంగా ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాల కులాల సర్వేని చేపట్టాలని జీఓలో ప్రభుత్వం స్పష్టంగా వివరించింది. ఇక సామాజిక, ఆర్థికపరమైన స్థితిగతులే కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలపైనా సర్వే చేయాలని ఆదేశించింది.ఈ మొత్తం ప్రక్రియను కేవలం 60 రోజుల్లోనే పూర్తి చేయాలని సదరు జీఓ ద్వారా చెప్పింది. సర్వేకు సంబంధించిన మార్గదర్శకాల కోసం అంతా ఎదురుచూస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతోనే సర్వే చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు ఒకటి, రెండు రోజులోనే వెలువడే అవకాశాలున్నాయని ప్రణాళిక సంఘం అధికారులు అంటున్నారుఇదే సంవత్సరం ఫిబ్రవరి 2న గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తయిపోయింది. అయితే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికల వైపు మొగ్గు చూపించలేదు. దీంతో గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన ప్రారంభమైంది.కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు రెఢీగా ఉన్నా బీసీ కులగణన కారణంగా ఎన్నికలు సకాలంలో నిర్వహించలేకపోయింది. ఎన్నికల సంఘం మాత్రం తమపని తాము చేసుకునిపోయింది.అసెంబ్లీ ఓటర్ల జాబితాలను అనుసరించి గ్రామ పంచాయతీలు, వార్డుల లెక్కన గతనెల 29నాటికే ఫైనల్ జాబితాను సంసిద్ధం చేసింది. ఓటర్ జాబితాలను సైతం రెఢీగా పెట్టారు. కుల గణన సర్వే వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయింది.స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను ఖరారు చేశాకే ఎన్నికలను నిర్వహించనుంది ప్రభుత్వం. డిసెంబర్ నెలాఖరు వరకు ఈ సర్వే ప్రక్రియ పూర్తికానుంది. ఈలోగా బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల స్థితిగతులపై ప్రభుత్వానికి ఓ అంచనా వస్తుంది. మొత్తం కులగణన సర్వే తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లను ఖరారు అవుతుందని సమాచారం.ట

# ఈ సారి చలి ఎక్కువే

హైదరాబాద్: ఈ చలికాలంలో హైదరాబాద్ సహా తెలంగాణ ప్రజలు అధిక చలిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అక్టోబరు, నవంబరు మధ్య కాలంలో లా నినా కారణంగా ఈ చలికాలంలో తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు బాగా పడిపోతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. భూమధ్యరేఖకు సమీపంలో సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తగ్గితే దాన్ని లా నినా అంటారు. సాధారణం కంటే కనీసం 0.5 డిగ్రీలు పడిపోతే లా నినా ఎఫెక్ట్ అంటారు. పసిఫిక్ మహాసముద్రం పెరూ తీరంలో ఈ ఉష్ణోగ్రతల్లో మార్పులు జరుగుతాయి. లా నినా తరచుగా తెలంగాణతో పాటు మన దేశంలోని కొన్ని ప్రాంతాల్లో చల్లని వాతావరణానికి దారితీస్తుంది.ఐఎండీ చెప్పిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది చలికాలంలో ప్రజలు వణికిపోవాల్సిందే. ఉదయాన్నే పొగమంచు ఎక్కువగా ఉంటుందని ఐఎండీ తెలిపింది. మామూలుగా హైదరాబాద్‌లో ప్రతి శీతాకాలం చలి సాధారణం కంటే అధికంగా ఉండదు. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ప్రకారం.. లా నినా ప్రభావంతో తెలంగాణలో గతంలోనూ ఇటువంటి వాతావరణ పరిస్థితి నెలకొంది.చివరిసారిగా 2022లో లా నినా ప్రభావంతో అతి చల్లని వాతావరణాన్ని తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్నారు. ఆ సంవత్సరంలో రాజేంద్రనగర్, పటాన్ చెరు వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 8 డిగ్రీల వరకు పడిపోయాయి. ఇక ఆదిలాబాద్‌లో 4 డిగ్రీలకు కూడా పడిపోయింది.లి నినా ప్రభావంతో గతంలో హైదరాబాద్‌లోనూ సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం లి నినా పరిస్థితుల వల్ల త్వరలోనే సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వాటిని ఎదుర్కొనేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉండాలని ఐఎండీ సూచించింది

# 92 నియోజకవర్గాల్లో రోడ్లకు మహర్దశ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని గ్రామిణ రోడ్ల అభివృద్ధికి ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 92 నియోజకవర్గాల్లో 641 పనులకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. గ్రామిణ ప్రాంతాల్లో 1323.86 కిలోమిటర్ల మేర నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.1377.66 కోట్ల నిధులను విడుదల చేసింది. ఆర్దిక ఇబ్బందులు ఎదురవుతున్నా గ్రామిణ రోడ్ల అభివృద్ధి కోసం పట్టుబట్టి నిధులు సాధించారు పంచాయతీరాజ్ గ్రామిణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.దివ్యాంగులు ఇకపై అధికారుల చుట్టూ తిరగనక్కర్లేదని సీతక్క అన్నారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ దివ్యాంగుల జాబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా సీతక్క మాట్లాడుతూ, ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువగా ఉన్నాయని, ఇతర వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయని, శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదని అన్నారు. పోషకాహార లోపం, ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుందన్నారు. అందుకే వాళ్లకు ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలని, దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే చాలని అన్నారు. వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయని, అందుకోసమే ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని సీతక్క స్పష్టం చేశారు.సంక్షేమ నిధుల నుంచి ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నామని, ప్రైవేట్ ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు మంత్రి. గతంలో ఒక శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు పాటిస్తామని చెప్పారు. సంక్షేమం, విద్యా, ఉద్యోగ రంగంలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని స్పష్టం చేశారు. దివ్యాంగుల పరికరాల కోసం ఈ ఏడాది బడ్జెట్లో రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దివ్యాంగులు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా తమకే వారి సమస్యలను షేర్ చేయొచ్చునని, మెసేజ్ పాస్ చేస్తే చాలని వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న వీటి భర్తీ ప్రక్రియ మొదలుపెట్టామని సీతక్క తెలిపారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం చేయూతనిస్తామని చెప్పారు.

# సీఎంకు కామన్ మ్యాన్ నుంచి ప్రశంసలు

హైదరాబాద్: కొందరు చేపట్టే పనులు కొందరికి అనర్థాలు అయితే.. మరికొందరికి మంచి చేస్తుంటాయి. సరిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంలో కూడా ఇదే జరిగింది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రేవంత్ హైడ్రాను తీసుకొచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరాన్ని వరదల బారి నుంచి సంరక్షించాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను నేలమట్టం చేస్తూ వస్తున్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూలుస్తున్నారు అయితే.. హైడ్రా చర్యలతో కొంతమంది ఇబ్బంది పడుతున్నా చాలా మందికి మాత్రం పెద్ద గుణపాఠం నేర్పింది. అందులోనూ ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఆస్తులు కొనుగోలు చేయాలనుకునే వారికి మాత్రం కళ్లు తెరిపించారని చెప్పాలి. అక్రమార్కుల వలలో పడకుండా.. ఎలాంటి ఆస్తులను కొనాలి.. ఎలాంటి జాగ్రత్తలు పాటించాలని హైడ్రా ఒకవిధంగా గుర్తుచేసింది. హైదరాబాద్‌లో వృత్తిరీత్యా, వ్యాపారం నిమిత్తం చాలా మంది గ్రామాల నుంచి వలస వచ్చి బతుకుతున్నారు. దాంతో ఇక్కడ సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. అయితే కొంత మంది రియల్టర్ల మోసాలకు బలవుతున్నారు.చాలా మంది రియల్టర్లు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో అధికారులను మచ్చిక చేసుకొని నామమాత్రంగా పర్మిషన్లు తీసుకొని కట్టడాలు చేపట్టారు. అయితే.. అలా చాలా మంది వేలాదిగా ఇళ్లను ప్రజలు కొనుగోలు చేశారు. అన్ని అనుమతులు ఉన్నాయనుకున్న వీరు కొన్నారు. ఇప్పుడు హైడ్రా వాటన్నింటినీ నేలమట్టం చేస్తూ వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూల్చివేతల్లో పెద్ద పెద్ద అపార్టుమెంట్లు సైతం ఉన్నాయి. కోట్ల విలువ చేసే విల్లాలు సైతం ఉన్నాయి. హైడ్రా వేటిని కూడా వదలకుండా అన్నింటినీ కూల్చివేస్తూ వచ్చింది. పెద్ద చిన్న అనే తేడా లేకుండా అందరికీ ఒకటే న్యాయం అన్నట్లుగా ప్రభుత్వం సూచనలు పాటిస్తూ ముందుకు సాగుతోంది.ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలు కొనుగోలు చేయకుండా హైడ్రా పలు జాగ్రత్తలు సూచించింది. అయితే.. ఏ కట్టడం ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నదో.. ఏది బఫర్ జోన్లో ఉందో కూడా ప్రజలకు కనిపెట్టడం కష్టం. ఇప్పుడు ఈ సమస్య లేకుండా హెచ్ఎండీఏ కొత్త వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్ పరిధిలోని చెరువులను గుర్తించి, వాటి బఫర్ జోన్‌ను నిర్ణయించింది. దీని ద్వారా బఫర్ జోన్ ను ఈజీగా తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. శ్రీజీనివబ.ష్ట్రఏటజీ.ణనీల.తిని అనే వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరిచింది. ఇందులో జిల్లా, మండలం, గ్రామం పేరుతో మీ స్థలం బఫర్ జోన్ లేదా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నదా లేదా అని తెలుసుకోవచ్చు. బఫర్ జోన్ పరిధిలో వ్యవసాయం లేదంటే ఇతర వ్యవసాయ ఆధారిత పనులు చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ.. శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దనే నిబంధనలు ఉన్నాయి. కొత్త వెబ్ సైట్ తీసుకురావడంతో ఇప్పుడు అందరూ కూడా కాస్త రిలాక్స్ అయ్యారు. కొనుగోలు చేసే కట్టడం ఏమైనా ఇబ్బందుల్లో ఉన్నదా అనే తెలుసుకునే అవకాశం ఉండడంతో రేవంత్ రెడ్డిని ఓ వైపు మెచ్చుకుంటున్నారు

# గ్రామీణ రోడ్లపై సర్కార్ నజర్

**- రూ.1377.66 కోట్లు విడుదల**

**- 92 నియోజకవర్గాలకు ప్రాధాన్యం**

**- త్వరలో మరో రూ.400 కోట్లు ?**



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ రోడ్లపై రాష్ట్ర సర్కార్ నజర్ పెట్టింది. ప్రజలకు ప్రయాణాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని 1323.86 కిలోమీటర్ల మేర కొత్తరోడ్లు, మరమ్మత్తుల కోసం శ్రీకారం చుట్టింది. అందుకోసం రూ.1377.66 కోట్లను విడుదల చేసింది. త్వరలో మరో రూ.400 కోట్లను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నది. తరుచూ అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రామీణ రోడ్ల అధ్వాన్న స్థితిపైనే అధికార, విపక్ష ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండటంతో వాటిపై సర్కార్ దృష్టిపెట్టింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించడంపై ప్రాధాన్యం కల్పించింది. పల్లెలకు మధ్య అనుసంధానంగా ఉండే లింకురోడ్లను కూడా నిర్మాణం చేపట్టనున్నది. దీంతో పదేండ్ల కాలంలో కనీసం చిన్నచిన్న మరమ్మత్తులకు కూడా నోచుకోని రోడ్లకు ఈసారి మహర్దశ పట్టనున్నది. ఎమ్మెల్యేలు, ఎంపీల వినతులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం గుర్తించిన రోడ్లను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్లాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగానే గ్రామీణ నేపథ్యమున్న 92 నియోజవర్గాలకు ప్రాధాన్యం కల్పించింది. అందులోనూ ప్రజల ప్రయాణాలకు అత్యంత అవసరమున్న కొత్త రోడ్లను వేయడంపై దృష్టిసారించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో 1323.86 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నల్లగొండ నియోజక వర్గంలో అత్యధికంగా 42.55 కిలోమీటర్లు, బాన్సువాడ నియోజకవర్గంలో 39.90 కిలోమీటర్ల మేర రోడ్లను వేయనున్నది. మహబూబాబాద్ నియోజకవర్గానికి అత్యధికంగా రూ.35 కోట్లను విడుదల చేసింది. చాలా నియోజకవర్గాలకు రూ.15 కోట్లకుపైనే ప్రకటించింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా గ్రామీణ రోడ్లకు పట్టుబట్టి నిధులు సాధించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) విజయం సాధించారు. సీఎం, ఆర్థిక మంత్రుల వద్ద పట్టిబట్టి మరీ పంచాయతీ రోడ్లకు నిధులు విడుదల చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక జిల్లాల్లో గ్రామీణ రోడ్లు, లింకు రోడ్లు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. వాటి పునరుద్ధరణ కోసం కూడా ఇప్పటికే రూ.24 కోట్లు కేటాయించిన విషయమూ విదితమే. త్వరలో వాటి కోసం రూ.50 కోట్లు కూడా కేటాయించ బోతున్నట్టు తెలిసింది.

# పదోన్నతులు ఇచ్చినందుకు థ్యాంక్స్



హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చినందుకు తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, విద్యుత్‌శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్‌కు కృతజ్ఞతలు తెలిపింది. సోమవారం అసోసియేషన్ ప్రతినిధి బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రినీ, ఆ శాఖ కార్యదర్శిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా టీజీజెన్‌కోలో 170 మంది ఏఈలు, 33 మంది ఏఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించారని తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగంలో 34 మంది ఏడీఈలకు డీఈలుగా, ఏడుగురు డీఈలకు ఎస్ఈలుగా, ఇద్దరు ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతులు లభించాయని వివరించారు. వీరితో పాటు మరికొందరికి కూడా పదోన్నతులు ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ కార్యదర్శిని కలిసిన వారిలో అధ్యక్ష, కార్యదర్శులు పీ రత్నాకరరావు, సదానందం, సహాధ్యక్షులు వెంకటనారాయణరెడ్డి, కిషోర్, సురేష్‌కుమార్, పీవీ రావు, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణు, అనిల్‌కుమార్, సుజిత్, రాజు, రాజేష్, రెమెడీ శ్రీనివాస్, నాగరాజు తదితరులు ఉన్నారు.

# 18న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవం

**- 'పదేండ్ల ప్రయాణం కల్లుగీత వృత్తిలో ఉపాధి' పై సదస్సు: కేజీకేఎస్**



హైదరాబాద్: కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్స వాన్ని 18న హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమ ణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమ వారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో విలేకర్లతో మాట్లాడుతూ వార్షికోత్సవానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బీసీ ఫైనాన్స్ కార్పొ రేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి, టాడీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్, వివిధ కల్లు గీత సంఘాల నాయకులు హాజరవుతారని చె ప్పారు. వార్షికోత్సవాల సందర్భంగా 'తెలంగాణ లో పదేండ్ల ప్రయాణం-కల్లుగీత వృత్తిలో ఉపా ధి అవకాశాలు' అంశంపై సెమినార్ నిర్వహించ నున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెం కట నరసయ్య, నాయకులు కృష్ణ స్వామి, సుధాకర్, లింగం గౌడ్, యాదయ్య, ప్రభాకర్, ఆంజ నేయులు, నరసింహ్మా, శ్రీశైలం పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

**- కనీస వేతనం రూ.26 వేలివ్వాలి**

**- ఏఎన్‌పీ, బీపీ, షుగర్ కేసుల టార్గెట్లు పెట్టకూడదు**

**- ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి**



సిద్దిపేట కలెక్టరేట్: ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడు తూ .. ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్‌పీ, బీపీ, షుగర్ కేసుల టార్గెట్లు పెట్టకూడదని డిమాండ్ చేశారు. 30 సంవత్సరాల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్, 20 ఏండ్ల నుంచి ఆశాలు.. ఎన్‌హెచ్ఎం స్కీంలో భాగంగా పనిచేస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కూడా ముందుండి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. డబ్ల్యుహెచ్ఓ ఆశా వర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును సైతం అందించిందన్నారు. ప్రస్తుతం ప్రజలకు వస్తున్న సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచడంలో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశాలను కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు రోజు రోజుకు పనిభారం మరింత పెరుగుతున్నదని, పారితోషకాలు లేని పనులు చేయిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజారోగ్య సౌకర్యాల విషయంలో ఆందోళనకర పరిస్థితి కూడా ఉందని, ఆశాల సమస్యలతో పాటు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం చేయకపోవడం అత్యంత బాధాకరమన్నా రు. జనాభా పరిమితి ప్రకారం ఆశాలనూ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశాల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ప్రవీణ, అధ్యక్షురాలు మంజుల, నాయకులు భూలక్ష్మి, యాదలక్ష్మి, బాలమణి, సుజాత, రేణుక, భాగ్య, శ్రీలత, అరుణ, లక్ష్మీ, శోభ, రజిత, కావ్య, జ్యోతి, సంజీవ్ పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**